# కురుక్షేత్ర యుద్ధములో శస్త్రాస్త్ర ప్రయోగం

# KURUKSHETRA YUDDAMLO SASTRASHTRA PRAYOGAM

Link No.1-19/35, No.F.MRP-325/2019
(MRP - RUSA 2.0 STC JUNE 2019)

With the Financial Assistance from St.Theresa's College for Women (A)
Eluru under RUSA 2.0

D.UMA MAHESWARI
Student Investigator
Class : II Year B.A., HGT
Regd. No.31805005
Student Minoir Research Project, 2020

రాష్ట్రీయ ఉచ్చతర శిక్ష అభియాన్

తెలుగు విభాగము

శ్రీ వై.ఎన్.కళాశాల (NAAC-A) స్వయప్రతిపత్తి కళాశాల

**Copy of the Research work done by : D.Uma Maheswari, II B.A., HGT**
**Regd. No.31805005, Student Investigator,**
**RUSA Student Minor Research Project**
**Department of Telugu, Sri Y.N.College (A)**
**NAAC - A Grade College**
**with CGPA 3.41, College with Potential Excellence**
**NARASAPUR - 534 275**

## DECLARATION

I, **Y.Venkateswara Rao,** Department of Telugu, Sri Y.N.College (A), Narsapur, W.G.Dt., declare that this Research Work entitled **"KURUKSHETRA YUDDAMULO SASTRASTRA PRAYOGAM"** has been guided by me under the scheme of **RUSA Student Minor Research Project in Telugu** during the period from **June, 2019 to December, 2019** which has not previously formed the basis for the award of any Degree, Diploma, Associate Ship or Fellowship.

PRINCIPAL

PRINCIPAL
Sri Y.N.College (Autonomous)
NAAC Accredited 'A' Grade College
NARSAPUR - 534 275, W.G.Dt., (A.P)

Y.VENKATESWARA RAO
GUIDE

SRI Y.N. COLLEGE (A) NAAC 'A' Grade College * NARSAPUR *

# DECLARATION

I, D.Uma Maheswari, student of II B.A., HGT, Regd. No.31805005, Sri Y.N.College (A), Narsapur, W.G.Dt., declare that this research work entitled **"KURUKSHETRA YUDDAMULO SASTRASTRA PRAYOGAM"** has been written by me under the guidance of Sri Y.Venkateswara Rao under the Scheme of RUSA Student Minor Research Project in Telugu during the period from June, 2019 to December, 2019 which has not previously formed the basis for the award of any Degree, Diploma, Associate Ship or Fellowship.

Y.VENKATESWARA RAO
Guide

D.Uma maheswari
D.UMA MAHESWARI
Student Investigator

SRI Y.N. COLLEGE (A) NAAC 'A' Grade College ★ NARSAPUR

PRINCIPAL
Sri Y.N. College (Autonomous)
NAAC Accredited 'A' Grade College
NARSAPUR - 534 275, W.G.Dt., (A.P)

PRINCIPAL

# కురుక్షేత్రయుద్ధంలో శస్త్రాస్త్రప్రయోగం

# విషయసూచిక


| క్రమసంఖ్య | విషయము | పేజి |
|---|---|---|
| 1. | మహాభారతాన్ని గూర్చి....... | 01 |
| 2 | మహాకవి తిక్కనను గూర్చి ..... | 02 |
| 3. | కురుక్షేత్రయుద్ధ నేపథ్యాన్నిగూర్చి ..... | 03 |
| 4. | శస్త్రాస్త్రములు | 06 |
| 5. | కురుక్షేత్రయుద్ధంలో ప్రయోగింపబడిన విశిష్ట ఆయుధములు, అస్త్రములు | 17 |
| 6. | భీష్మపర్వం | 24 |
| 7. | ద్రోణపర్వం | 34 |
| 8. | కర్ణపర్వం | 40 |
| 9. | శల్యపర్వం | 43 |
| 10. | సౌప్తికపర్వం | 44 |
| 11. | ముగింపు | 47 |


...........

## మహాభారతాన్ని గూర్చి.......

శ్రీ వేదవ్యాస విరచితమైన, పంచమవేదంగా భావింపబడు మహాభారతం తొలుత 'జయం' అనే పేరుతో కావ్యంగా ప్రసిద్ధం కాగా, కవిత్రయమని పిలువబడు ముగ్గురు కవులు దీనిని ఆంధ్రీకరించారు. వారిలో మొదటి వాడైన నన్నయ క్రీ.శ.11వ శతాబ్దంలో మొదటి రెండు ఆది, సభా పర్వాలను, మూడవదైన అరణ్యాపర్వంలో కొంతభాగాన్ని రచించి, మరణిం చాడు. తరువాత రెండవవాడైన తిక్కన క్రీ.శ. 13వ శతాబ్దంలో అరణ్యాపర్వ శేషాన్నివదలి, నాల్గవ దైన విరాటపర్వం మొదలుకుని, పద్దెనిమిదవదైన స్వర్గారోహణ పర్వంవరకు పదిహేనుపర్వాలు రచించాడు. మూడవవాడైన ఎఱ్ఱాప్రగడ క్రీ.శ. 14వ శతాబ్దంలో అరణ్యాపర్వశేషాన్ని పూరించాడు. అష్టాదశ పర్వ పరిమితమైన మహాభారతం ఆదిపంచకమని, యుద్ధషట్కమని శాంతి సప్తకమని మూడు భాగాలు. మొదటిఐదు పర్వాలు ఆది, సభా, అరణ్య, విరాట, ఉద్యోగ పర్వాలను ఐదిం టిని ఆదిపంచకమని, తరువాత పర్వాలు భీష్మ, ద్రోణ, కర్ణ, శల్య,సౌప్తిక, స్త్రీపర్వాలు ఆరింటిని యుద్ధషట్కమని, శాంతి, అనుశాసనిక, అశ్వమేధ, ఆశ్రమవాస, మౌసల, మహాప్రస్థాన, స్వర్గా రోహణ అను ఏడు పర్వాలను శాంతి సప్తకమని పిలుస్తారు.

వీటిలో యుద్ధషట్కము భీష్మ, ద్రోణ, కర్ణ, శల్య,సౌప్తిక, స్త్రీ పర్వాలు ఆరింటిలో కురుక్షేత్రమహాసంగ్రామం వర్ణింపబడింది. ఈ మహాసంగ్రామంలో కౌరవ, పాండవపక్షముల నుండి, అనేక శస్త్రాస్త్రాలు ప్రయోగింపబడ్డాయి. వాటి వివరాలు, ప్రయోగసందర్భము, ప్రయోగ విధానము, ప్రాధాన్యత, ఆవశ్యకత, ప్రయోజనము, వాటి ఫలితాలనుగూర్చి వివరించడం ఈ వ్యాస ముఖ్యోద్దేశము. అస్త్రవిద్యాభ్యాసానికి సాధన, సహనము ఎంత అవసరమో, నేటి విద్యా విధానానికి, విద్య అభ్యాసానికి, విద్య అన్వయానికి ఇది ఏవిధంగా దోహదపడుతుందో తెలియ చెప్పడం ఈ వ్యాసలక్ష్యం. మహాభారతంలో కురుక్షేత్రయుద్ధం ఒకమహనీయ ఘట్టం. ఇది క్రీ.పూ. 1328 సంవత్సరంలో జరిగినట్లు శ్రీ వేదవ్యాస్ (ఐ.ఎ.యస్.) గారి అభిప్రాయం. భారత యుద్ధం జరిగిన కురుక్షేత్రం ప్రస్తుతం 'హర్యానా' రాష్ట్రంలో వుంది. ఇది ఢిల్లీకి ఉత్తరదిక్కుగా 120కి.మీ.దూరంలోఉంది. యుధిష్ఠిర, జనమేజయ మొదలైన పేర్లతో కనబడు శాసనాధారాలను, మరికొన్ని సాక్ష్యాధారాలను అనుసరించి, ఈ కాలప్రమాణం సరిఅయినదేనని, ధృవీకరించ బడింది. ఈఆరు పర్వాల ఆంధ్రీకరణకర్త కవిత్రయంలో రెండవవాడైన మహాకవి తిక్కన.

## మహాకవి తిక్కనను గూర్చి .....

***'ఈ పంచమవేదమును నవిమర్శముగా విభజించినపుడు అందు మూడే ముఖ్యవిషయములు గోచరించును. 1. రాజనీతి, 2. యుద్ధతంత్రము, 3. బ్రహ్మవిద్యోపదేశము. '..... 'పుస్తకచేత, నడవడికచేత, విజ్ఞానముచేత, ఈ మూడు మహాధర్మములు ఆత్మధర్మములుగా నిర్వహించి, అనుభవగోచరము చేసుకొనిన కవి తెలుగునాట తిక్కన యొక్కడే!'***

**( ఆంధ్రసాహిత్యచరిత్ర. పుట. 222, శ్రీ పింగళి లక్ష్మీకాంతము )**

కనుకనే అనితరసాధ్యమైనరీతిలో వ్యాసహృదయాన్ని సమగ్రంగా ఆవిష్కరించగల నేర్పు ఒక్క తిక్కనకేసాధ్యం.

తిక్కన నెల్లూరు మండలాన్ని పరిపాలించిన మనుమసిద్ధి మహారాజు ఆస్థానంలో మంత్రి, దండనాథుడు. దాయాదుల వలన తనరాజు రాజ్యభ్రష్టుడైనపుడు, వానిని అజ్ఞాతంలోవుంచి, ఓరుగల్లును పాలించిన గణపతిదేవ మహారాజును దర్శించి, అతడిని తన వాక్చాతుర్యంతో మెప్పించి, వాని సైనికబల సహాయంతో యుద్ధంలో కులోత్తుంగచోళుని ఓడించి, తిరిగి తన రాజు మనుమసిద్ధిని సింహాసనమున ప్రతిష్టించిన ఘనుడు తిక్కన. మంత్రిగా, రాయబారిగా, రాజనీతిచతురునిగా, హితునిగానేకాక, కదనరంగంలోసైతం కత్తి త్రిప్పగల వీరుడు, అపర తెలుగు చాణక్యుడు తిక్కన.

మనుమసిద్ధిమహారాజు సాహచర్యంలో, దాయాదుల పోరులో, ఎత్తుకు పైఎత్తులు వేయడం, రాజుకు తోడ్పడడం, రాయబారిగా నైపుణ్యం, వ్యూహరచనలో చాకచక్యం, యుద్ధమర్మాలను గ్రహించడం, మహామంత్రిత్వం, దండనాయకత్వం, మొదలైనవన్నీ తిక్కనను గొప్పమంత్రిగా, మహాసేనానిగా తీర్చిదిద్దాయి. అపారమైన ఈ రాచరికపు, యుద్ధరంగ అనుభవమే తిక్కనకు 15పర్వాల మహాభారతరచనకు అర్హతను, అనుభవాన్ని సాధించిపెట్టాయి. మనుమసిద్ధి అజ్ఞాతవాసానుభవం పాండవుల అజ్ఞాతవాసంగా, గణపతిదేవునివద్దకు తన రాయబారానుభవం, మాటనేర్పరితనం, శ్రీకృష్ణరాయబారంగా, తాను, తనవంశీయులు చేసిన యుద్ధాలలోని వ్యూహరచనానుభవంతోబాటు, యుద్ధానంతర భయంకర, విషాదకరదృశ్యాలు ఇన్నిట వానికి గల అపార అనుభవము, మొదలైనవన్నీ ముఖ్యంగా యుద్ధషట్కంలోని ఆరు పర్వాల రచనలో తిక్కనను మహాకవిగా తీర్చిదిద్దాయి. పాత్రోచితమైన శైలి, సంభాషణాచాతుర్యము,, వర్ణన,

## మహాకవి తిక్కనను గూర్చి .....

***'ఈ పంచమవేదమును సవిమర్శముగా విభజించినపుడు అందు మూడే ముఖ్యవిషయములు గోచరించును. 1. రాజనీతి, 2. యుద్ధతంత్రము, 3. బ్రహ్మవిద్యోపదేశము. '..... 'పుట్టుకచేత, నడవడికచేత, విజ్ఞానముచేత, ఈ మూడు మహాధర్మములు ఆత్మధర్మములుగా నిర్వహించి, అనుభవగోచరము చేసుకొనిన కవి తెలుగునాట తిక్కన యొక్కడే!'***

**( ఆంధ్రసాహిత్యచరిత్ర. పుట. 222, శ్రీ పింగళి లక్ష్మీకాంతము )**

కనుకనే అనితరసాధ్యమైనరీతిలో వ్యాసహృదయాన్ని సమగ్రంగా ఆవిష్కరించగల నేర్పు ఒక్క తిక్కనకేసాధ్యం.

తిక్కన నెల్లూరు మండలాన్ని పరిపాలించిన మనుమసిద్ధి మహారాజు ఆస్థానంలో మంత్రి, దండనాథుడు. దాయాదుల వలన తనరాజు రాజ్యభ్రష్టుడైనపుడు, వానిని అజ్ఞాతంలోవుంచి, ఓరుగల్లును పాలించిన గణపతిదేవ మహారాజును దర్శించి, అతడిని తన వాక్చాతుర్యంతో మెప్పించి, వాని సైనికబల సహాయంతో యుద్ధంలో కులోత్తుంగచోళుని ఓడించి, తిరిగి తన రాజు మనుమసిద్ధిని సింహాసనమున ప్రతిష్ఠించిన ఘనుడు తిక్కన. మంత్రిగా, రాయబారిగా, రాజనీతిచతురునిగా, హితునిగానేకాక, కదనరంగంలోసైతం కత్తి త్రిప్పగల వీరుడు, అపర తెలుగు చాణక్యుడు తిక్కన.

మనుమసిద్ధిమహారాజు సాహచర్యంలో, దాయాదుల పోరులో, ఎత్తుకు పైఎత్తులు వేయడం, రాజుకు తోడ్పడడం, రాయబారిగా నైపుణ్యం, వ్యూహరచనలో చాకచక్యం, యుద్ధమర్మాలను గ్రహించడం, మహామంత్రిత్వం, దండనాయకత్వం, మొదలైనవన్నీ తిక్కనను గొప్పమంత్రిగా, మహాసేనానిగా తీర్చిదిద్దాయి. అపారమైన ఈ రాచరికపు, యుద్ధరంగ అనుభవమే తిక్కనకు 15పర్వాల మహాభారతరచనకు అర్హతను, అనుభవాన్ని సాధించిపెట్టాయి. మనుమసిద్ధి అజ్ఞాతవాసానుభవం పాండవుల అజ్ఞాతవాసంగా, గణపతిదేవునివద్దకు తన రాయబారానుభవం, మాటనేర్పరితనం, శ్రీకృష్ణరాయబారంగా, తాను, తనవంశీయులు చేసిన యుద్ధాలలోని వ్యూహరచనానుభవంతోబాటు, యుద్ధానంతర భయంకర, విషాదకరదృశ్యాలు ఇన్నిట వానికి గల అపార అనుభవము, మొదలైనవన్నీ ముఖ్యంగా యుద్ధషట్కంలోని ఆరు పర్వాల రచనలో తిక్కనను మహాకవిగా తీర్చిదిద్దాయి. పాత్రోచితమైన శైలి, సంభాషణాచాతుర్యము,, వర్ణన,

సందర్భోచిత రసపోషణ, పాత్రల హావభావ విక్షేపాదుల వర్ణన, నాటకీయతాశైలి ఇవి తిక్కనకు గల ప్రత్యేక కవిత్వలక్షణాలు. 18 రోజులు జరిగిన,18 అక్షౌహిణుల సైన్యం పాల్గొన్న కురుక్షేత్ర యుద్ధంలో, కౌరవ, పాండవవీరులు ప్రయోగించిన శస్త్రాస్త్రాలను, వాటి ప్రభావాలను తిక్కన అద్వితీయంగా వర్ణించాడు.

...........

## కురుక్షేత్రయుద్ధ నేపథ్యాన్నిగూర్చి .....

శకుని మాయాద్యూతంవల్ల తమ సమస్త సంపదను కౌరవులకు ఓడిపోయిన పాండవులు జూదనియమాన్ననుసరించి జరిపిన 12 సంవత్సరాల అరణ్యావాసమే అరణ్యపర్వం. తరువాత విరాటరాజుకొలువులో వారుసాగించిన అజ్ఞాతవాసమే విరాటపర్వం. అనంతరం పాండవులు తమకు రావలసిన రాజ్యభాగంకోసం చేసే ప్రయత్నమే ఉద్యోగపర్వం. ఉద్యోగమంటే ప్రయత్నమని అర్థం.

కార్యసాధనకు సామ, దాన, భేద, దండోపాయాలనే చతుర్విధోపాయాలను ఉపయోగించడం రాజనీతి. ద్రుపదరాజపురోహితుడు పాండవుల నుండి దూతగాపలికిన సవినయ వాక్యాల సామోపాయం ఫలించలేదు. ఇదేసామోపాయాన్ని ప్రదర్శించి, సంజయరాయబారం ద్వారా ధృతరాష్ట్రుడు తన వక్రనీతిని బయటపెట్టాడు. సహనంతో అరణ్యావాస, అజ్ఞాతవాసాలను పూర్తిచేసిన పాండవులు తమ రాయబారం ద్వారా కౌరవులతో సంధిని, సహజీవనాన్ని కోరుకున్నారు. తమకు రావలసిన రాజ్యభాగాన్ని గౌరవంగా ఇవ్వాలని, ఇంద్ర ప్రస్థం కాకపోతే మరేపట్టణమైనా ఇవ్వవచ్చని ధర్మరాజు సంజయునిద్వారా వర్తమానంపంపడం దానోపాయం. నిజానికి ఆ పట్టణ నిర్మాణం, మయసభ, ఇవన్నీ రాజసూయయాగ సందర్భంగా ధర్మరాజు సాధించినవే! సంధికోసం వాటిని వదులుకోవడానికి సిద్ధపడడం త్యాగరూప దానోపాయం. అదికూడా ఫలించలేదు. కనీసం ఐదుగురికి ఐదూళ్ళిమ్మనిన కోరిక ఫలించదని, దుర్యోధనుడు దానికి అంగీకరించడని ధర్మరాజుకు తెలును. కనుక సామ,దానోపాయాలు కౌరవులవద్ద ఫలించవు. చివరకు కౌరవులనుండివచ్చిన ఉలూకుని రాయబారం అధిక్షేపాత్మకంగా సాగి, అది కూడా ఫలించలేదు.

యుద్ధం జరగడమనేదానిని అధికంగా చేసి, భయపెట్టడంవల్ల, స్వభావం చేత ధర్మపక్షపాతులు, పాండవపక్షపాతులు అయిన భీష్మ,ద్రోణాదులతో దుర్యోధనాదులకు భేదభావం ఏర్పడుతుంది. ఉద్యోగపర్వంలో రెండు ప్రధానసభలు జరిగాయి. ఒకటి ధర్మరాజు సభ. రెండవది శ్రీకృష్ణుని రాయబారసభ. రెండింటికి కృష్ణుడే సూత్రధారి. స్వభావంచేత శాంతి కాముకుడు, యుద్ధవిముఖుడు, అజాతశత్రుడు అయిన ధర్మరాజు సంధి ప్రయత్నాలను వాని తమ్ములైన భీమాదులు మొదట విభేదించినా, వ్యతిరేకించినా, వారు నలుగురు అన్నగారి మాట జవదాటరు. ఇక్కడ వారి ఐకమత్యం స్పష్టమౌతుంది. కానికౌరవసభలో సంధికి ఇష్టపడని దుష్టచతుష్టయంతోబాటు, సంధిద్వారా యుద్ధాన్ని నివారించి, తద్వారా కులక్షయం కాకుండా కౌరవవంశాన్ని కాపాడాలనుకునే భీష్మ,ద్రోణాదులతో కౌరవసభ విభిన్నశక్తుల కూటమి. అక్కడ ఐకమత్యం సాధ్యంకాదు. కనుకనే రెండవదైన కౌరవసభలో శ్రీకృష్ణరాయబార సమయంలో వారి అనైక్యత స్పష్టమయ్యింది. కృష్ణుడి భేదోపాయం అక్కడ విజయవంతమయ్యింది. అంతేకాక, కర్ణునికి వాని జన్మరహస్యం తెలిపి, కృష్ణుడు వారిమధ్య భేదాభిప్రాయానికి ప్రయత్నించడం విశేషం.

నిజానికి 18 రోజులు జరిగిన కురుక్షేత్ర యుద్ధంలో కౌరవులనుండి సర్వసైన్యాధ్యక్షులైన భీష్మ, ద్రోణ, కర్ణ, శల్యులలో భీష్ముడు సింహాసన రక్షణభార ధర్మానికి, ద్రోణుడు తాను ధృతరాష్ట్రునిచే పోషింపబడినవాడు కనుక ఆ ధర్మానికి, కర్ణుడు తనఅభిమానాన్ని కాపాడిన దుర్యోధనునితో స్నేహధర్మానికి, శల్యుడు పాండవులకు బంధువైనా, దుర్యోధనుని మోసానికి గురియై, ఆడినమాట తప్పని ధర్మానికి కట్టుబడి, కౌరవుల తరపున యుద్ధం చేసినవారేతప్ప, కౌరవులపై అభిమానంతోకాదు. ' యతోధర్మ స్తతోజయ:' అన్నట్టు ధర్మాత్ములైన పాండవులదే జయమని వారికి తెలుసు. అందువలనే కృష్ణుని భేదోపాయం కౌరవసభలో ఫలించింది. కాని కృష్ణుని కౌరవసభకు రాయబారిగా పంపడంలో ధర్మరాజు అంతరార్థం వేరు.

*సుతువాడై వినయంబు సేకొనక యేజొప్పుందగంజెప్పకా*
*ధృతరాష్ట్రుండవినీతి( జేసినను సంధింపగరాదంచు వే*
*గ తెగంబారకు, తెంపు సేయునెడ లోకంబెల్లమెచ్చం బ్రకా*
*సిత ధర్మస్థితినొంది, మామనము నిశ్చింతంబుగ (జేయుమా!*

( ఆంధ్ర మహాభారతం. ఉద్యోగపర్వం....తృతీయాశ్వాసము....25 పద్యము.)

అని ధర్మరాజు శ్రీకృష్ణునితో అన్నాడు.

తమకష్టాలకు ధృతరాష్ట్రుని పుత్రప్రేమ కారణమని, తమ సంధి మాటలను, వినయాన్ని అతడు చెవినపెట్టడని, సుయోధనుని సమాధానపరచలేడని ధర్మరాజుకు ముందే తెలుసు. కాని తాననుసరిస్తున్న ధర్మమేదో దానిని సకలక్షత్రియలోకము గుర్తించడం అతడికి ముఖ్యం. అందుకే కౌరవసభలో లోకం మెచ్చునట్లుగా,తనధర్మం ప్రకాశితమయ్యేటట్లుగా చేసి, తనకు నిశ్చింత కలిగించమని అతనిభావం. తనకు రావలసిన రాజ్యభాగాన్ని బలప్రయోగంతో సంపాదించగలిగే శక్తియుక్తులున్నా, ధర్మరాజు తనధర్మబద్ధమైన,రాజనీతితో కూడిన విధానాన్ని అనుసరించడమనే విషయం లోకానికి తెలియడం అతడికి ముఖ్యం. కనుకనే అతడి ప్రవర్తన ఆదర్శప్రాయమయ్యింది. చివరకు ఇది దండోపాయానికి దారితీసి, కురుక్షేత్రయుద్ధం అనివార్యమయ్యింది.

అక్షౌహిణి అనగా 21,870 రథాలు, 21,870 ఏనుగులు, 65,610 గుఱ్ఱములు, 1,09,350 కాల్బలము. కురుక్షేత్రయుద్ధంలో పాల్గొన్న 18 అక్షౌహిణుల సైన్యములో, కౌరవ పక్షాన 11 అక్షౌహిణుల సైన్యము, పాండవపక్షాన 7 అక్షౌహిణుల సైన్యము యుద్ధము చేయగా, మొత్తం సైన్యం నాశనమయ్యింది. కౌరవపక్షాన కృతవర్మ, కృపాచార్యుడు, అశ్వత్థామ మాత్రమే మిగిలినవారు. కురుక్షేత్రయుద్ధంలో అనేక శస్త్రాలు, అస్త్రాలు ప్రయోగింపబడ్డాయి.వాటి ప్రయోగ విధానము, ఫలితము తెలుసుకోవడం అవసరం.

.............

## శస్త్రాస్త్రములు:

మానవుని నాగరికత పరిణామక్రమంలో ఆహార సంపాదనార్థం, ఆత్మరక్షణార్థం మానవుడు మొదట రాతితో,లోహం కనిపెట్టబడినతరువాత ఇనుముతో అనేక పనిముట్లు, ఆయుధాలను తయారుచేసుకున్నాడు. శిలాయుగంనుండి, లోహయుగానికి పరిణామంచెందే క్రమంలో రాతి, లోహ ఆయుధాలు సాధారణమైనవి. కాని మానవజీవితక్రమంలో తన మనుగడకు తన మేధాశక్తితో,పరిశీలనాత్మకశక్తితో, గాలి,నీరు,నిప్పు వంటి మానవాతీత, ప్రకృతిశక్తుల ఆవశ్యకతను ప్రభావాలను గ్రహించిన మానవుడు, దావానలం, ప్రచండవాయువు, జల ప్రళయాలను చూసిన మానవుడు ఆ శక్తుల తీవ్రతను గమనించి, వాటిని తన అధీనంలోనికి తెచ్చుకునే ప్రయత్నంచేశాడు. ఆ శక్తుల అధిపతులైన అగ్ని, వాయువు, వరుణుడు మొదలైన దేవతలను భక్తితో,సాధనతో, ఏకాగ్రతతో ధ్యానించి, మెప్పించి, వాటిని తనకు అనుకూలంగా మలచుకునే ప్రయత్నంచేశాడు. అవే అస్త్రాలయ్యాయి.

అనగా మనిషికిగల సాధారణ ఆయుధాలన్నీ శస్త్రాలవుతాయి. భక్తితో, ఉపాసనతో దేవతలను మెప్పించి సాధించిన అసాధారణమైన, మానవాతీతమైన, మంత్రపూరితమైన ఆయుధాలు అస్త్రాలయ్యాయి. అయితే మంత్రపూరితమైన అస్త్ర ప్రయోగానికి ఉపకరణంగా ఆయుధం అవసరం. కనుక సాధారణమైన ఆయుధం సాధించలేని ప్రయోజనం, అసాధారణమైన, మానవాతీతమైన అస్త్రశక్తి సాధించగలదు.

కురుక్షేత్రయుద్ధంలో కురు,పాండవవీరులు శత్రుసంహారానికి,తమ అవసరాలకు, ప్రయోజనాలకు అనుగుణంగా శస్త్రాస్త్రాలను రెండింటిని ప్రయోగించారు.

...........

## శస్త్రములు, వాటి వివరణ :

**శస్త్రములు:** సాధారణమైన ఆయుధములన్నీ శస్త్రములే!

1. కైదువ, కత్తి : ఒక ఆయుధ విశేషము.
2. ద్రోణము : ఇది చాపకర్షణ సాధనమునకు పేరు. (వింటినారి లాగుటకై భుజబలమును కలిగించు ఒకవిధమగు ఉపకరణము)
3. పుంఖము : బాణపు చివరిభాగము లేక పిడి పింజ, దాని ధ్వని
4. పాఱవాతము : ఇది విశాలమైన ముఖముగల సాయకము.
5. దో(టమ్ము, చిల్లకోల : ఇది దుష్కంటక శరమునకు పేరు. ( బాణాగ్రము చెవివలె వంకరగా వుండు ములికికి పేరు)
6. దోనమ్ము : చిన్న, అల్పమైన బాణము.
7. నారాచము : ఇనుపబాణము
8. చేయమ్ము,జోడమ్ము : విల్లు అవసరములేక చేతితో విసిరెడి బాణము.
9. అంపఱ : బాణముల సమూహము.
10. చిలుకు, ముల్కి : బాణాగ్రపు ఉక్కుతునక
11. తరకసము,పొది,బత్తలిక, పాణివడమ్ము, దొన. : ఇవి తూణీరము, అమ్ములపొదులకు పేర్లు
12. వాలు,ఖండా, కరవాలు, మేల్కత్తి,తరవలి, నరాజి, పిరంగి, అడిదము. : ఇవి ఖడ్గములకు పేర్లు
13. దార, వాయి : ఇవి ఖడ్గపు అంచునకు పేర్లు.
14. పెణక : ఇది కరవాల పృష్ఠము.
15. చూరి : కృపాణకాగ్రము
16. సూరె, కటారి, : చిన్నకత్తి
17. తరవలి : పట్టాకత్తి
18. పట్టెము, అడ్డకత్తి : ఇవి పట్టసమునకు పేర్లు (రెండువైపులా పదును కలవి.)

19. ఒర : ఖడ్గాదులు దాచుకొను భాగము.
20. చిల్కడ : ఒరకు కట్టెడి త్రాడు
21. పరుజు, పరుంజు : ఇవి కత్తిపిడి చివరిభాగమునకు పేర్లు
22. పలక : డాలు వంటి ఆయుధ విశేషము
23. కీడెము : చర్మపుడాలు
24. గుదియ,దుడ్డు,గునపము : ఇవి ముద్గరమునకు పేర్లు
25. చిల్లకోల : ఆయుధవిశేషము.
26. కుఠారము : గొడ్డలి, పరశువు
27. ముద్గరము : గదావిశేషము
28. భిండిపాలము : ఇనుపనాళముగల ఆయుధము,
రెండు, మూడు చక్రములుగల కత్తి
29. ఖండపరశువు : గండ్రగొడ్డలి
30. బరిప, బడిత : ఇది పరిఘ నకు పర్యాయము
31. జముదాడి : ఇది ఒకవిధమైన కటారి
32. ఈటె, నేఱ, బరచి : ఇది కుంతమునకు పర్యాయము.
33. గొరక : అల్పకుంతము
34. బల్లెము : ఇది భల్లమునకు పర్యాయము.
35. బాగుదార : చిన్నకత్తి
36. చిల్లాణము : వంకరకత్తి
37. డొంకెన : ఆయుధ విశేషము
38. యమదాటి : యమధార, ఒక బాణము.
39. నేజ : తోమరము, ఒక ఆయుధము
40. త్రికాష్ఠి : మూడు కర్రలతో ఏర్పడు ఆయుధవిశేషము
41. దంచనము : ఇది రాళ్ళు రువ్వెడి శిలా యంత్రము

***(అచ్చుతెలుగు కోశము ..ద్వితీయ సంపుటము...పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి)***

వీటిలో ఖడ్గప్రయోగములు-32, ప్రాసప్రయోగములు-6, శూలప్రయోగములు-6, తోమరప్రయోగములు-4, గదాప్రయోగములు-12, పరశు ప్రయోగములు-6, ముద్గర

ప్రయోగములు-3, తోమర (చిల్లకోల) ప్రయోగములు-5, పట్టిస ప్రయోగములు-3 విధములుగా కలవని విష్ణుధర్మోత్తర మహాపురాణంలో చెప్పబడింది.

***(విష్ణుధర్మోత్తర మహాపురాణం.. ద్వితీయఖండము...అనువాదకులు..***
***(శ్రీ కల్లూరి వేంకట సుబ్రహ్మణ్యదీక్షితులు... శ్రీ వేంకటేశ్వర ఆర్షభారతి ట్రస్ట్.. హైదరాబాద్)***

కురుక్షేత్రయుద్ధంలో ధనుస్సులు, గదలు, ఈటెలు, వంకర కత్తులు, రోకళ్ళు, ఇనుపగుదియలు, చిల్లకోలలు, గండ్రగొడ్డళ్ళు ( పరశువు ), రెండు ,మూడు నాల్కలుగల పెద్ద సూదులు, బల్లెములు, మొదలైన శస్త్రములు ప్రయోగింపబడినట్లు వర్ణింపబడింది.

' శక్తి ' ఆయుధం :

దీనిని కురుక్షేత్రయుద్ధంలో కౌరవ, పాండవ ఇరుపక్షాలలో చాలామంది వీరులు ప్రయోగించారు. ఇది శస్త్రము. ఈటె వంటి ఇనుప ఆయుధం. గురితప్పకుండా దీనిని ప్రయోగిస్తే శత్రువుకు చావుతప్పదు. ఇది కత్తి, బల్లెం, బాణం కలపిన ఒక విధమైన ఆయుధ విశేషము. ' శక్తి ' పేరుతో ఇంద్రుడిచ్చిన 'అస్త్ర' విశేషము కలదు. ఈరెండు ఒకటి కావు.

.........

## అస్త్రములు, వాటి వివరణ :

### అస్త్రములు :

ఇవి అసాధారణమైనవి, మానవాతీతమై, మంత్రశక్తి కలిగినవి.

సాధకుడు ఒక విద్యను అభ్యసించడంలో, కఠోరసాధనలో అవ్యక్తి యోగిగా మారతాడు. అట్టివాడు ఆ విద్యను సద్వినియోగం చేస్తాడే తప్ప, దుర్వినియోగం చెయ్యడు.విద్య ప్రాథమిక ప్రయోజనం ప్రజాసంక్షేమం. విద్య పిచ్చివానిచేతిలో రాయిగా మారకూడదు. విద్య వినయాన్ని, సహనాన్ని నేర్పుతుంది. పూర్వం బ్రాహ్మణ, క్షత్రియవర్గాలు మాత్రమే విద్య నేర్చుకోవడానికి అర్హులు. ధనుర్వేద అభ్యాసమునకు బ్రాహ్మణ, క్షత్రియులకు బ్రాహ్మణుడు గురువు. బ్రాహ్మణుడు ఆ విద్యను అధ్యయన, అధ్యాపకత్వానికి, క్షత్రియుడు ప్రజారక్షణ, తద్వారా రాజ్య రక్షణకు మాత్రమే విద్యను ప్రయోగించడంవల్ల ఆ విద్య నేర్చిన ప్రయోజనం చేకూరుతుంది తప్ప, విద్యను వ్యక్తిగత ఆవేశాలకు, ప్రతీకారాలకు వినియోగించడం విద్యకు ప్రయోజనంకాదు. ధర్మ సంస్థాపనార్థం అవసరమైతే గురువును సైతం ఎదిరించి యుద్ధంచేసిన వీరులూవున్నారు. అంబను వివాహంచేసుకొమ్మనిన తన గురువు పరశురామునితో భీష్ముడే ద్వంద్వ యుద్ధానికి సిద్ధపడ్డాడు. చివరకు అతడు తన ప్రతిజ్ఞకు భంగం కలగకుండా వుండడంకోసం, గురువు ఆజ్ఞను అనుసరించి తానుఅంబను వివాహమాడితే కురువంశానికి కలిగే ఉపద్రవాన్ని నివారించడంకోసం, తన గురువుపై అష్టవసువులు తనకిచ్చిన మోహనాస్త్రాన్ని సంధించడానికి కూడా వెనుకాడలేదు. విద్యను సక్రమవినియోగంలో, ధర్మసంస్థాపనలో అతడు తన గురువునే జయించాడు.

అస్త్రవిద్యసాధనకు దైవదత్తమైకాని, గురుముఖత: విద్యనేర్చుకోవడం తప్ప మరోమార్గంలేదు. ద్రోణుడుకూడా అగ్నివేశుడనే ఋషిని సేవించి ధనుర్విద్యను, పరశురాముని నుండి దివ్యాస్త్రాలను పొందినప్పటికి, తనను అవమానించిన తన సహపాఠి పాంచాలరాజు ద్రుపదుని అహంకారం అణచడానికి తనశిష్యుడైన అర్జునుని ప్రయోగించి వానిని బంధింపచేసి,వానికి కనువిప్పు కలిగించాడుతప్ప, తనవిద్యతో ప్రతీకారం తీర్చుకోవాలనుకోలేదు. పిడికిలి బిగింపు, గురికొట్టే నేర్పు,అలసటలేనితనం, ఇతర ఆయుధసామర్థ్యం, ప్రావీణ్యతలను మెచ్చి, ద్రోణుడు తనకు ప్రియమైన శిష్యుడు అర్జునుడొక్కడే అని నమ్మితన కుమారుడైన అశ్వత్థామకు కూడా నేర్పని ఎన్నో దివ్యాస్త్రాలను వానికి ఉపదేశించాడు. ద్వంద్వ, సంకీర్ణ యుద్ధాలను,

చతుర్విధ బల రహస్యాలను, బహువిధ వ్యూహ భేదోపాయాలను, తెలిపి మహావీరునిగా తయారు చేశాడు. చివరకు అనితర సాధ్యమైన బ్రహ్మశిరోనామాస్త్రాన్నికూడా నేర్పి, తనంతవానిగా సమ్మానించాడు. కాని ఇన్ని చేసినా తన అనుమతిపొందికాని, తనతో ద్వంద్వయుద్ధం చెయ్యకుండా అర్జునుని కట్టడి చేశాడు. కనుకనే అర్జునుడుకూడా గురుశిష్యుల నియతిని దాటలేదు. కురుక్షేత్రయుద్ధంలో ఆచార్యుని అనుమతిపొంది, ఆయన అర్జునుడిపైశస్త్రాస్త్రాలు మొదట ప్రయోగించిన తరువాతనే అతడు ఆయనపై బాణ ప్రయోగం చేశాడు.

18 రోజులు జరిగిన కురుక్షేత్రయుద్ధంలో మొదటిరోజునుండి, చివరివరకు కౌరవ, పాండవులలో క్రమక్రమంగా అక్రమప్రవృత్తి పెరుగుతూ వచ్చింది. ముఖ్యంగా యుద్ధరంగంనుండి భీష్ముని నిష్క్రమణానంతరం ద్రోణునినుండి ఈ జయేచ్ఛ, వారు నేర్చుకొనిన విద్యను వక్రమార్గాన్ని అనుసరించేలా చేసింది. తన మరణానికి కారకుడైన ధృష్టద్యుమ్నుని పుట్టుకకు కారకుడని, తనను అవమానించాడని, ద్రుపదునిపై క్రోధంతో శుక్రాచార్యాంశ కలిగిన ద్రోణునిలో బ్రాహ్మణసహజమైన సాత్విక లక్షణాలుపోయి, క్షత్రియోచితమైన రౌద్ర స్వభావం అలవడింది. అది వానిలో అసుర ప్రవృత్తికి కారణమై ద్రుపదునిపై ప్రతీకారేచ్ఛను ప్రజ్వరిల్ల చేసింది. యుద్ధనియమాలను అతిక్రమించి,ద్రోణుడు తన బ్రాహ్మణ తత్వానికి విరుద్ధంగా ప్రవర్తించాడు.

శిఖండిని అడ్డుగాచేసి, భీష్మునిపై బాణప్రయోగంచెయ్యడంతో మొదలైన అక్రమయుద్ధం,కురుక్షేత్రయుద్ధం చివరివరకు యథేచ్ఛగా సాగింది. అభిమన్య, ఘటోత్కజ, ద్రోణ, సైంధవ, కర్ణ, దుర్యోధనాది వీరుల మరణాలన్నీ అక్రమమైనవే! యుద్ధనియమాలను అతిక్రమించినవే! సమస్త కౌరవ, పాండవ వీరులు గతులు తప్పడంతో విద్య ప్రయోజనమే నాశనమయ్యింది. విద్య విషయంలో అర్జునునికిగల సహనం అశ్వత్థామలో లేదు. పుత్రప్రేమతో ద్రోణుడు అశ్వత్థామకు నేర్పిన బ్రహ్మశిరోనామాస్త్రాన్ని కురుక్షేత్రయుద్ధం చివరిలో అతడు గడ్డిపరకపై అభిమంత్రించి పాండవులపై ప్రయోగించాడు. ద్రోణుడు అతడికి ప్రయోగమే తెలిపాడుతప్ప,ఉపసంహారాన్ని నేర్పలేదు. అది ప్రజాసంక్షయానికి, పాండవవంశ నాశనానికి కారణమయ్యింది. కనుక విద్యను అక్రమమార్గంలో వినియోగించడంవల్ల విద్యనేర్చిన ప్రయోజనం నాశనమయ్యింది.

## ధనుర్వేదము :

### అస్త్రముల పుట్టుక:

*'అస్త్రములు భృశాశ్వుని కుమారులు. భృశాశ్వుడు ప్రజాపతులలో ఒకడు. దక్షుని కుమార్తెలైన జయ, సుప్రభ అనువారలనితడు పెండ్లియాడెను. ఒక్కొక్కరు పదులపదుల పుత్రులను కడసిరి. వారు అస్త్రములైరి.వీటిని విశ్వామిత్రుడు పొందెను.' కనుక విశ్వామిత్రుని యొక్క అస్త్రగురువు భృశాశ్వుడు.*

**( పూర్వగాథాలహరి... వేమూరి శ్రీనివాసరావు..... వేంకట్రామ పబ్లికేషన్స్)**

*' అస్త్రహృదయమనునది ఒక విద్య. సకల రిపునాశనకరమును అగునొక అస్త్రవిద్య. దీనిని రుద్రుడు స్వాయంభువునకు, అతడు వశిష్ఠమహర్షికి, అతడు చిత్రాయుధు డను గంధర్వునకు, అతడు తన దౌహిత్రియగు మనోరమకు, ఉపదేశింపగా, ఆమె తనమేనత్త యగు వరూధిని కుమారుడైన స్వారోచికి ఉపదేశించినట్లు మార్కండేయపురాణమున కలదు.'*

**( ఆంధ్రవిజ్ఞానము... ప్రసాదభూపాలుడు ..... యస్.ఆర్.పి. వర్క్స్, కాకినాడ )**

ధనుర్వేదమునందు నాలుగు పాదములు కలవు. అవి రథములు, గజములు, తురగములు, కాల్బలము. ధనుర్వేదము ఐదు విధములైన యుద్ధవిధానములు కలది. అవి యంత్రముక్తము, పాణిముక్తము, ముక్తసంధారితము, అముక్తము, బాహుయుద్ధము. ఇవి శస్త్రాస్త్రములు రెండింటికి వర్తించును.

మరియు ఇది ఋజుయుద్ధము, మాయాయుద్ధమని రెండువిధములు.

1. యంత్రముక్తము : ఇది క్షేపణి, యంత్రము, చాపములను గుర్చి తెలుపునట్టిది.
2. పాణిముక్తము : ఇది శిలలు, తోరములు,చక్రములు మొదలగు వానిని గుర్చి తెలుపునట్టిది.
3. ముక్తిసంధారితము : ఇది పాశములు మొదలగువాటికి సంబంధించినది.
4. అముక్తము : ఇది ఖడ్గములు మొదలగువాటికి సంబంధించినది.
5. బాహుయుద్ధము : ఇది బాహువులతో ఆయుధములుపయోగించనిది.

## ధనుర్వేదమునందు స్థాన వర్ణనము:

ధనుర్విద్య ప్రదర్శనమందు మానవుడు నిలబడు విధములు ఇందు వర్ణింపబడినవి. ఇవి సమపదము, వైశాఖము, ప్రత్యాలీఢము, స్థానభూతము, ప్రత్యాఖ్యాతము, విచ్ఛకము, సంపుటము అని ఏడు విధములు.

1. సమపదము : ఇది చేతులు, కాళ్ళు దగ్గరకుచేర్చి నిలచుట.
2. వైశాఖము : ఇది చేతివ్రేళ్ళు స్థిక్కులు, పిరుదులు గుంటలానించి, మోకాళ్ళు కదలకుండ, పాదములానించి, వితస్త ( 12 అంగుళముల) ఎడముగా నిలచుట.
3. ప్రత్యాలీఢము : విలుకాడు కుడికాలు ముందుకు చాచి, నిలచుట. ఇందు కుడి పిక్క తీరుకాకుండ, ఎడమపిక్క అడ్డము తిరిగి యుండును.
4. స్థానభూతము : ఇందు చీలమండలమీద చేతులూనుకొని, నిలచుట. రెండు చీలమండలకు 5 అంగుళముల దూరముండవలెను.
5. ప్రత్యాఖ్యాతము: ఇది స్థానభూతమునకు వ్యతిరేకము. అనగా చీలమండలకు నడుమ 12 అంగుళముల దూరముండవలెను.
6. విచ్ఛకము : ఇందు ఎడమకాలు వంచి, కుడి మోకాలు చాచి నిలుచుట
7. సంపుటము : ఇందు కుడికాలు వంచి, ఎడమకాలు చాచి నిలచుట.

**(విష్ణుధర్మోత్తర మహాపురాణం.. ద్వితీయఖండము... 178,179 అధ్యాయములు.**
**అనువాదకులు.. శ్రీ కల్లూరి వేంకట సుబ్రహ్మణ్యదీక్షితులు...**
**శ్రీ వేంకటేశ్వర ఆర్షభారతి ట్రస్ట్.. హైదరాబాద్)**

సాధారణ ఆయుధము శస్త్రము, మంత్రపూరితమైనది అస్త్రము. సాధారణ శక్తికి భిన్నంగా భక్తితో, ధ్యానం, మంత్రోపాసనలతో మానవాతీతశక్తిచే, అతీంద్రయశక్తిచే సాధించునట్టిది అస్త్రము. కాలము, దూరము, వేగము, నిర్ణీతప్రదేశమున లక్ష్యఛేదనము, సాధన ఇవన్నీ నేటి కాలపు అణ్వస్త్రాలను పోలివుండేది. అయితే నాటికాలంలో ఉపాసన, భక్తిద్వారా సాధించిన దీనిని, నేటి కాలంలో శాస్త్రీయదృక్పథం ద్వారా సాధిస్తున్నారు. ఈ అస్త్రప్రయోగ విషయంలో నాటియుద్ధాలలో జరిగినవన్నీ ఇతిహాసకర్తలు ఊహించి, కల్పించినవా? అనేది నేటి

ఆధునిక హేతువాదుల ప్రశ్న. నిజానికి వారు ఊహించినట్లు ఇది ఇతిహాసకర్తలు ఊహించి, కల్పించినదే అయితే వారి భావనాబలం ఒక గొప్ప అద్భుతం.

అస్త్రసాధనకు ప్రధానంగా కావలసినవి 1. మంత్రం, 2. ధ్యానం, 3. జపం , 4. హోమం. అస్త్రప్రయోగం మూడంచెలుగా వుంటుంది. అవి 1. సంధానం, 2. మోక్షణం, 3. ఉపసంహారం. అస్త్రాన్ని ప్రయోగించే కౌశలమే మోక్షణం. వీటిలో సంధాన మోక్షణ, కౌశలాలు తెలిసినప్పటికీ, అస్త్రాన్ని ప్రయోగించేవ్యక్తికి దానిని ఉపసంహరించే శక్తి తెలిసివుండాలి. లేకపోతే అది శత్రువునేకాక, ప్రయోగించిన ప్రయోక్తను,తటస్థ జగత్తునుకూడా నాశనంచేస్తుంది. కురుక్షేత్రయుద్ధం చివరిలో అశ్వత్థామకు తాను ప్రయోగించిన బ్రహ్మశిరో నామా స్త్రాన్ని ఉపసంహరించడం తెలియకపోవడంవల్ల అంత అనర్థం జరిగింది.

*'మంత్ర, ధ్యాన, జప, హోమాలలో చాలామందికివాటిపై జ్ఞానం, అవగాహన కలిగివుండవచ్చు. ఈ ధ్యానమనేది అష్టాంగాలలో ఒకటి. 1. యమం, 2. నియమం, 3.ఆసనం, 4. ప్రాణాయామం, 5. ప్రత్యాహారం, 6. ధారణ, 7. ధ్యానం, 8. సమాధి. అనేవి అష్టాంగాలు. వీటిలో ధారణ, ధ్యాన, సమాధులను కలిపి సంయమం అంటారు. చిత్తవృత్తిని ఏకాగ్రం చెయ్యడం ధారణ, సాధకునకు తన ధ్యేయానికి ఏకాగ్రచిత్తం అవసరం. ఆధ్యాత్మిక సాధనలో చివరిది సిద్ధి. అదే సమాధి. కనుక ధ్యానమనేది ధారణకు, సమాధికి మధ్య వారధి. బుద్ధి, తర్కము, ప్రజ్ఞ ఎక్కడ ఆగిపోతుందో అక్కడనుండి అంతరంగికమైన సమ్యక్ స్ఫూర్తి ఆరంభమౌతుంది. ఈశక్తి ధ్యాన,యోగాలవల్ల సిద్ధిస్తుంది.'*

( అరణ్యపర్వ పీఠిక.... తి.తి.దే. ప్రచురణ.... తిరుపతి)

.......

ఆధునిక హేతువాదుల ప్రశ్న. నిజానికి వారు ఊహించినట్లు ఇది ఇతిహాసకర్తలు ఊహించి, కల్పించినదే అయితే వారి భావనాబలం ఒక గొప్ప అద్భుతం.

అస్త్రసాధనకు ప్రధానంగా కావలసినవి 1. మంత్రం, 2. ధ్యానం, 3. జపం , 4. హోమం. అస్త్రప్రయోగం మూడంచెలుగా వుంటుంది. అవి 1. సంధానం, 2. మోక్షణం, 3. ఉపసంహారం. అస్త్రాన్ని ప్రయోగించే కౌశలమే మోక్షణం. వీటిలో సంధాన మోక్షణ, కౌశలాలు తెలిసినప్పటికి, అస్త్రాన్ని ప్రయోగించేవ్యక్తికి దానిని ఉపసంహరించే శక్తి తెలిసివుండాలి. లేకపోతే అది శత్రువునేకాక, ప్రయోగించిన ప్రయోక్తను,తటస్త జగత్తునుకూడా నాశనంచేస్తుంది. కురుక్షేత్రయుద్ధం చివరిలో అశ్వత్థామకు తాను ప్రయోగించిన బ్రహ్మశిరో నామా స్త్రాన్ని ఉపసంహరించడం తెలియకపోవడంవల్ల అంత అనర్థం జరిగింది.

*'మంత్ర, ధ్యాన, జప, హోమాలలో చాలామందికివాటిపై జ్ఞానం, అవగాహన కలిగివుండవచ్చు. ఈ ధ్యానమనేది అష్టాంగాలలో ఒకటి. 1. యమం, 2. నియమం, 3.ఆసనం, 4. ప్రాణాయామం, 5. ప్రత్యాహారం, 6. ధారణ, 7. ధ్యానం, 8. సమాధి. అనేవి అష్టాంగాలు. వీటిలో ధారణ, ధ్యాన, సమాధులను కలిపి సంయమం అంటారు. చిత్తవృత్తిని ఏకాగ్రం చెయ్యడం ధారణ, సాధకునకు తన ధ్యేయానికి ఏకాగ్రచిత్తం అవసరం. ఆధ్యాత్మిక సాధనలో చివరిది సిద్ధి. అదే సమాధి. కనుక ధ్యానమనేది ధారణకు, సమాధికి మధ్య వారధి. బుద్ధి, తర్కము, ప్రజ్ఞ ఎక్కడ ఆగిపోతుందో అక్కడనుండి ఆంతరంగికమైన సమ్యక్ స్ఫూర్తి ఆరంభమౌతుంది. ఈశక్తి ధ్యాన,యోగాలవల్ల సిద్ధిస్తుంది.'*

( అరణ్యపర్వ పీఠిక.... తి.తి.దే. ప్రచురణ.... తిరుపతి)

.......

## యుద్ధములందు ప్రయోగింపబడు వివిధ అస్త్రముల పేర్లు:

1. దండచక్రము
2. ధర్మచక్రము
3. కాలచక్రము
4. విష్ణుచక్రము
5. ఇంద్రచక్రము
6. వజ్రాస్త్రము
7. శైవాస్త్రము
8. శూలావతం
9. బ్రహ్మశిర:
10. ఐషీకం
11. బ్రహ్మాస్త్రము
12. వాయువ్యము
13. హయశిర:
14. క్రౌంచము
15. విష్ణుశక్తి
16. రుద్రశక్తి
17. కంకాళము
18. ముసలం
19. కాపాలం
20. కింకిణము
21. విద్యాధరం
22. నందనం
23. గాంధర్వం
24. సమ్మోహనం
25. ప్రస్వాపనం
26. ప్రశపనం
27. మోదకి
28. శిఖరి
29. ధర్మపాశం
30. కాలపాశం
31. శుష్కాశని
32. ఆర్ద్రాశని
33. పైనాకము
34. నారాయణం
35. ఆగ్నేయం
36. శిఖరం
37. వర్షణం
38. శోషణం
39. సంతాపనం
40. విలాపనం
41. మాదనం
42. దుర్ధర్షం
43. కందర్పదయితం
44. మానము
45. పైశాచం
46. మోహనం
47. తామసం
48. సౌమనం
49. మౌసలం
50. సత్యం

**( వాల్మీకి రామాయణం .....బాలకాండ.. వాల్మీకి......పరిమళ పబ్లికేషన్స్ )**

## మరికొన్ని అస్రములు :

### బ్రహ్మదండము :

*‘ బ్రహ్మాణాస్త్రేణ సంయోజ్య బ్రహ్మదండనిభంశరమ్*
*సంయోజ్య ధనుషిశ్రేష్ఠే విచకర్షమహాబల: ’*

అని రామాయణం యుద్ధకాండలో చెప్పబడింది.

**( వాల్మీకి రామాయణం.. యుద్ధకాండ... 22 వ సర్గ... 5వ శ్లోకం. )**

**‘ మహాబలుడగు రాముడు బ్రహ్మదండ సమానంబగు భయంకర శరంబుదీసి, దాని బ్రహ్మాస్త్రంబుతో నభిమంత్రించి, వింటంగూర్చి,....’**

దీనివల్ల బ్రహ్మదండమనేది ఒక అస్త్రమనుటకంటె, సర్వశక్తిసమన్వితమైన ఒక ఆయుధము అనుట సమంజసము. పూర్వము దీనిని ధరించి, వశిష్ఠుడు విశ్వామిత్రుడు ప్రయోగించిన ఆయుధములను, అస్త్రములను త్రిప్పికొట్టగలిగెను. దీనివలననే వశిష్ఠుని గొప్పదనమును గ్రహించిన విశ్వామిత్రునకు వానితో సమానుడు కావలెనని, ( ‘బ్రహ్మర్షి’ కావలెనని ) కోరికకలిగి ఘోరతపస్సు చేసెను.

**శబ్దభేది :**

ఇది అర్జునుడు తనకు తాను సాధనచేసినట్టిది. కంటికి కనబడనట్టి లక్ష్యమును శబ్దమువిని, బాణప్రయోగముతో ఛేదించునట్టిది. పాండవుల అరణ్యవాస సమయంలో దుర్యోధనుడు పాండవులను అధిక్షేపించాలని ఘోషయాత్ర నెపంతో అడవులకురాగా అతడు చిత్రసేనుడను గంధర్వునిచే బంధింపబడ్డాడు. ధర్మరాజు ఆజ్ఞతో వానిని విడిపించుటకై అర్జునుడు చిత్రసేనునితో యుద్ధముచేసిన సందర్భంలో ఈ శబ్దభేదివిద్యను ప్రయోగించి, అర్జునుడు తన బాణాలతో వానిని గాయపరిచాడు.

వీటిలో కొన్ని అస్త్రాలు మాత్రమే కురుక్షేత్రయుద్ధంలో ప్రయోగించబడ్డాయి.
వీటిలో లేని కొన్ని మహాస్త్రాలు కూడా ప్రయోగింపబడ్డాయి.
అవి ఈ దిగువ వివరించబడ్డాయి.

.......

## కురుక్షేత్రయుద్ధంలో ప్రయోగింపబడిన విశిష్ట ఆయుధములు, అస్త్రములు :

### కృష్ణార్జునుల రథం:

ఈ రథాన్ని ఖాండవదహనసమయంలో అగ్నిదేవుడు కృష్ణార్జునులకు ఇచ్చాడు. వివిధ ఆయుధములు కలది, నాలుగు తెల్లని గుఱ్ఱములు పూన్చినది, సింహపుతోక వంటి తోక కలది,కపిరాజు కేతనముగాకలది, తెల్లనిగుఱ్ఱములు పూన్చినది అయిన ఈ దివ్యరథాన్ని అధిరోహించి, ఖాండవవనదహన సమయంలో అగ్నికి సహకరించడమేకాక, కురుక్షేత్రయుద్ధంలో ఈరథం వారికి తిరుగులేని శక్తిని ప్రసాదించింది. కాని కురుక్షేత్రయుద్ధంలో భీష్మ, ద్రోణ, కర్ణాది కురువీరులు ప్రయోగించిన బాణాగ్ని ఆరథాన్ని చుట్టుముట్టి, కురుక్షేత్రయుద్ధానంతరం వారు రథం దిగిన మరుక్షణం, అది మండి, దగ్ధమయ్యింది.

### గాండీవం, అక్షయతూణీరం :

దేవతలు, నాగరాజులు, గంధర్వులు మెదలగువారు జయింపశక్యముకానిది, భేదింప సాధ్యంకానిది, వజ్రంవలె కఠినమైనది, దివ్యమైనది గాండీవమనే విల్లు. మంత్రసహితమైన బాణసమూహాలు సైతం దీన్నితాకి, వజ్రాయుధంచే కొట్టబడిన రాళ్ళవలె ముక్కలౌతాయి. శత్రుభయంకరమైనది, తరుగని బాణములుకల అమ్ములపొది అక్షయతూణీరం. ఇవికూడా ఖాండవదహనసమయం లో అగ్నిదేవుడు అర్జునునకు ఇచ్చాడు.అట్లే శత్రునాశనకరమైన సుదర్శనచక్రమును, కౌమోదకి అనుపేరుగల గదను కృష్ణునకు ఇచ్చాడు. పూర్వం బ్రహ్మదేవుడు ఈ ఆయుధాలను వరుణునకు ఇవ్వగా, అతడు అగ్నిదేవుని పనుపున ఆ ఆయుధములను కృష్ణార్జునులకు ఇచ్చాడు.

### పాశుపతాస్త్రం :

పశుపతి అనగా పరమశివుడు. అర్జునుడు తన అరణ్యావాసకాలంలో పరమశివుని గూర్చి కాలిబొటనవ్రేలిపై నిలచి, ఘోరతపస్సుచేసి, వానితో యుద్ధముచేసి, వానిని తన భక్తితో మెప్పించి, పాశుపతాస్త్రాన్ని పొందెను. ఆ సమయంలో వానిని జయించడం శివునికే కష్ట

మయ్యింది. అందుకే సైంధవుడు తనను గూర్చి తపస్సు చేసినపుడు వానిని తప్ప మిగిలిన పాండవులను ఒకరోజు జయించేటట్లు వరమిచ్చాడు.

ఈ పాశుపతాస్త్రం ప్రళయకాలంలో ప్రయోగింపబడి, జగత్సంహారం చేయునట్టిది. దీనినుండి లక్షలకొలది ఈటెలు, గుదియలు (గదలు) విషసర్పాలవంటి బాణాలు పుడతాయని చెప్పబడింది. శివుడు దీనిని స్వయంగా, సమంత్రకంగా అర్జునునకు ఉపదేశించి, ప్రయోగ, ఉపసంహారాలను తెలిపాడు. ఇది భీష్మ,ద్రోణాది మహావీరులను సహితం సంహరించ గలిగినట్టిది.

కురుక్షేత్రయుద్ధంలో ద్రోణుని సర్వసైన్యాధ్యక్షతన జరిగిన నాల్గవనాటి యుద్ధంలో అభిమన్యుని వధ అనంతరం, దానికి కారకుడైన సైంధవునిచంపి, వానిశిరస్సును, వానితండ్రి ఒడిలో పడునట్లు చేయుటకై, అర్జునుడు ఈ పాశుపతాస్త్రాన్ని ప్రయోగించెను.

## ' శక్తి ' అస్త్రము :

అర్జునుని పాశుపతాస్త్రం భీష్మ, కర్ణులను చంపగల అస్త్రశక్తి కలదని తెలిసినా, ఇచ్ఛామరణం వరముగాగల భీష్మునకు, సహజ కవచకుండలముల శక్తిగల కర్ణునకు అది అసాధ్యమని ఇంద్రుడు తలచాడు. కర్ణునికిగల సహజకుండలములచే అతడు అజేయుడని, వానివలన తనపుత్రుడైన అర్జునునకు ముప్పుకలుగునని తలచిన ఇంద్రుడు దానిని నివారించుటకు ఆ కవచకుండలములను దానమడుగుటకై బ్రాహ్మణరూపమున వానికడకు వచ్చెను. వాని కపటోపాయమును గూర్చి సూర్యుడు మునుపే కర్ణుని హెచ్చరించి, దానమివ్వవలదనెను. కర్ణుడు దానికి అంగీకరించకపోవుటచే కవచకుండలములకు ప్రతిగా వానినుండి ' శక్తి ' అస్త్రమును గ్రహించమని చెప్పెను.

ఈ ఆయుధం మహా భయంకరమైనది. నాలుకలు చాచుతూ, తళతళలకాంతి జ్వాలలు వెలరేగుతూ భయముగొల్పునట్టిది. తిరుగులేనిది. ఇది ఆకాశమార్గాన వస్తుంటే ఘంటానాదం వినబడుతుందని దీనిని గూర్చి వర్ణింపబడింది. శత్రువులను పలుమార్లు సంహరించి, మరలమరల చేతికి చేరుతుంది. పూర్వం ఈ ఆయుధంతో ఇంద్రుడు వేలకువేలు రాక్షసులను సంహరించెను. కాని కర్ణుడు కోరినమీదట ఇంద్రుడు వానికి దానినిచ్చి, దానిని కష్టసమయంలో మాత్రమే ప్రయోగించాలని, లేనిచో అదినీకే ప్రమాదమని హెచ్చరించెను. అంతేకాక,

***' నా ఆయుధవిశేషము 'శక్తి' నీ శత్రువులను శీఘ్రముగా సంహరించి, మరల నావేతికి వస్తుంది. ఇది భూలోకంలో గెలువశక్యంకాని నీ శత్రువును ఒకరిని చంపి, తిరిగి నావద్ధకువేరి, నన్ను సేవిస్తుంది ' అని చెప్పాడు.***

**( అరణ్యపర్వ వాఖ్యానం... పుట. 1196. తి.తి.దే. ప్రచురణ.... తిరుపతి. )**

కర్ణుడు దీనిని అర్జునసంహారానికై ప్రయోగించాలని తలచాడు. కాని కురుక్షేత్ర యుద్ధంలో దీనిని అత్యవసరసమయంలో ఘటోత్కజునిపై ప్రయోగించి, వాని మరణానికి కారకుడయ్యాడు. ఇది మొదట ఘటోత్కజుని మాయాజాలాన్ని ధ్వంసంచేసి, తరువాత వాని వక్షస్థలాన్ని భేదించింది.

'శక్తి' అనేది ఒక ఆయుధంగా కురుక్షేత్రయుద్ధంలో చాలామంది వీరులు ప్రయోగించారు. ఈ 'శక్తి' అనే ఆయుధము, ఇంద్రదత్తమైన 'శక్తి' అనే అస్త్రము రెండూ ఒకటి కాదు,

## నాగాస్త్రం :

ఖాండవదహనసమయంలో అర్జునుడు ప్రయోగించిన బాణాగ్నికి అనేక సర్పములు దగ్ధముకాగా, దానినుండి తప్పించుకొనిన ఒక సర్పము, సర్పముఖాస్త్రముగా మారి కర్ణుని చేరి, తమకు ఉమ్మడిశత్రువైన అర్జునుని చంపుటకై తనను ప్రయోగించమని కోరింది. కృష్ణుని మాయచే అది విఫలముకాగా, తిరిగి మరోసారి తనను ప్రయోగించమని కోరింది. కాని కర్ణుడు దానిని తిరస్కరించాడు.

## వైష్ణవాస్త్రం :

పూర్వం భూదేవితో రతికేళికి ప్రసన్నుడైన విష్ణువు ఈ వైష్ణవాస్త్రాన్ని ఆమెక వరంగా ప్రసాదించాడు. తరువాత ఇది భూదేవికి పుట్టిన నరకాసురుని వశమయ్యింది. తరువాత అది వాని పుత్రుడైన భగదత్తునికి వచ్చింది. ఘోరమైన ఈ అస్త్రం విష్ణువుకుతప్ప అన్యులకు సహింపరానిది. ద్రోణుని రెండవనాటియుద్ధంలో భగదత్తుడు దీనిని అర్జునునిపై ప్రయోగించగా కృష్ణుడు తన శరీరాన్నిదానికిఅడ్డుగా నిలిపాడు. అది వానిశరీరంపై పుష్పంవలె ప్రకాశించింది.

## గాంధర్వి :

ఈవిద్యను పూర్వం అర్జునుని తపస్సుకు మెచ్చి తుంబురుడు మొదలైన గంధర్వులు ఇచ్చారు. దానిప్రయోగంవల్ల చూసే రాజులకు అనేకరథాలు వారిని చుట్టుముట్టి అనేక శస్త్రాస్త్రాలు తమపై ప్రయోగించినట్లు అనిపిస్తుంది. అర్జునునినుండి ఈవిద్య గ్రహించిన అభిమన్యుడు దీనిని పద్మవ్యూహభేదన సమయంలో ప్రయోగించాడు.

## కవచధారణం :

ఈవిద్య ద్రోణునినుండి అర్జునుడు, వానినుండి అభిమన్యుడు పొందారు. దీనివల్ల యుద్ధరంగంలో వ్యక్తి శరీరం శస్త్రాస్త్రాలకు దుర్భేద్యమైనట్టిది. తన తండ్రినుండి ఈవిద్య గ్రహించిన అభిమన్యుడు దీనిని పద్మవ్యూహభేదన సమయంలో ప్రయోగించాడు.

## జలస్తంభనవిద్య :

ఇది ఒక క్షుద్రవిద్య. దీనినే సంస్తంభనవిద్య అనికూడా అంటారు.దీని ప్రభావము వల్ల వ్యక్తి జలములోనికి ప్రవేశించినపుడు ఆ నీరు వానిశరీరానికి తగలదు. కురుక్షేత్రయుద్ధం ముగిసిన తరువాత, దురోధనుడు పాండవుల బారినుండి తననుతాను కాపాడుకోవడానికి జలాలను శిలలతో పోలేవిధంగా తన జలస్తంభనవిద్యా పాండిత్యం ప్రదర్శించి,'ద్వైపాయనహ్రద' మనే మడుగులో దాగున్నాడు. మానవులెవరూ చొరరాని ఈనీరు దుర్యోధనుని పెనుమాయచేత వానిని కాపాడింది.అది అతడి విద్యావైదుష్యంతో స్తంభింపచేయబడిన జలదుర్గం.

.........

## కురుక్షేత్రయుద్ధము - శస్త్రాస్త్ర ప్రయోగము :

*'మహాభారతంలోని 18 పర్వాలలో 6వపర్వమైన భీష్మపర్వంనుండి, 11వపర్వమైన స్త్రీ పర్వంవరకు 6 పర్వాలను యుద్ధషట్కమని పిలుస్తారు. ఇవి రెండు భాగాలు. భీష్మ, ద్రోణ, కర్ణ పర్వాలు మొదటి భాగం, శల్య, సౌప్తిక, స్త్రీ పర్వాలు రెండవభాగం. వీటిలో భీష్మ, ద్రోణ, కర్ణ, శల్యులు 18 రోజుల కురుక్షేత్రయుద్ధంలో వరుసగా కౌరవ సేనకు అధ్యక్షత వహించారు, కనుక ఆవర్వాలు కౌరవ సేనానాయక నామాంకితాలు. తరువాత 18వనాడు అశ్వత్థామ సైన్యాధ్యక్షు డయ్యాడు. కనుక తరువాతి సౌప్తికపర్వం అశ్వత్థామ నామాంకితం కావాలి. కాని అతడు బ్రాహ్మణుడు, వానిప్రవర్తన క్షత్రియోచితం, వీరోచితంకాదు. కనుక వాని పేరు ఈ పర్వానికి అను చితం. కనుక సౌప్తికపర్వం వీరనామాంకితం. తరువాతి స్త్రీపర్వం ముందు 5 పర్వాలకు ఒక విధమైన సింహావలోకనం. యుద్ధానంతరం సమస్త సైన్యము నాశనంకాగా, యుద్ధపరిణామఫల మైన శోకము. వీటిలో భీష్మపర్వం యుద్ధవీరరసం, ద్రోణపర్వంరౌద్రరసం,కర్ణపర్వం అద్భుత రసం,శల్యపర్వం భయానకరసం,సౌప్తికపర్వం భీభత్సరసం, స్త్రీపర్వం కరుణరసంగా చెప్ప బడ్డాయి.'*

*( సౌప్తికపర్వం...పీఠిక.... పుట : 2, తి.తి.దే. ప్రచురణ, హైదరాబాద్. )*

కురుక్షేత్రయుద్ధమునకు ముందు ధర్మరాజు తనవంశ పెద్దలకు, గురువు లకు నమస్కరించి వారి అనుమతి పొందడంకోసం,తమకు జయం కలిగేటట్టు ఆశీర్వచనం పొందడంకోసం, కౌరవ సేనలోని కురుముఖ్యులను సమీపించాడు. వారిలో భీష్ముడు 'బంధు త్వాన్ని నామనసులో చొప్పించి, నాహృదయాన్ని కరగించి, వేడితే, నామనోధైర్యాన్నికోల్పోయి, యుద్ధాన్నిమాని, ఆయుధాన్ని విడిచి పెడితేతప్ప, నన్నుచంపడం సాధ్యంకాదు ' అని తన మరణరహస్యం చెప్పాడు. ద్రోణుడు 'కృష్ణుడు నీకు మంత్రియైయుండగా మరొకరిని జయం కొరకు అడుగనవసరంలేదు, ధర్మం ఏవైపు ఉంటే కృష్ణుడు ఆవైపు వుంటాడు. జయంకూడా ఆవైపే కలుగుతుంది. నాచేతిలో ఆయుధమున్నంతవరకు నన్నెవ్వరూచంపలేరు, ప్రాయోప వేశంచేసి, శస్త్రాస్త్రాలు విడిచిపెట్టినపుడు మాత్రమే నన్నుచంపడం సాధ్యమౌతుంది. నమ్మదగిన వ్యక్తివలన మిక్కిలి దుస్సహమైన కీడుమాట విన్నప్పుడు నేను శస్త్రాస్త్రాలను సన్యసిస్తాను, అప్పుడు నన్నుచంపడం సాధ్యం ' అని తన మరణరహస్యం చెప్పాడు.

*కృపాచార్యుడు అవధ్యుడు కనుక అతడు వధోపాయం చెప్పలేదు, కాని జయం కలుగునట్లు ఆశీర్వదించాడు. ధర్మరాజు శల్యుని ' నీవు కర్ణరథసారథ్యంచేసే టప్పుడు అతడిని నొవ్వబలికి, మాకు మేలు చేయమని ' వానినికోరాడు. ఈ విధంగా ధర్మరాజు కౌరవ సేనలోని ముఖ్యవీరులను తనకనుకూలంగా మలచుకొని, వారి ఆశీర్వచనాలను పొంది, తమజయానికి మార్గం సుగమం చేసుకున్నాడు.*

**( భీష్మపర్వ పీఠిక...పుట : 6 నుండి,వ్యాఖ్యాత : శ్రీ చెరుకూరి జయచంద్రశాస్త్రి)**
**తి.తి.దే. ప్రచురణ .... తిరుపతి - 2006.**

## కురుక్షేత్రయుద్ధమునందు పన్నబడిన వివిధ వ్యూహములు :

*'యుద్ధము కొఱకు సైన్యమును ఒక ప్రత్యేక ప్రదేశంలో శత్రువులు చొర బడడానికి వీలులేకుండా,విభజించి నిలుపుట వ్యూహము.ఇది దండము, భోగము,మండలము, అసంహతము అని నాలుగు విధములు. '*

**( భీష్మపర్వం...తృతీయాశ్వాసవ్యాఖ్యానం....పుట.297. తి.తి.దే. ప్రచురణ. )**

కురుక్షేత్రయుద్ధమునందు క్రౌంచ, అచల, త్రిముఖ, గరుడ, అర్ధ చంద్ర, మకర, శ్యేన (డేగ) , మండల, వజ్ర, కూర్మ, శృంగాటక, సర్వతోభద్ర, ధృఢ, శకట, అర్ధమండలాకార, పద్మ, సూచీ, దుర్జయ మొదలైన వివిధవ్యూహములు పన్నబడ్డాయి.

## చతురంగ బలములు :

యుద్ధమునందు రథ,గజ,తురగ, కాల్బలములని నాలుగు అంగములుగా చతురంగ బలములు పాల్గొనడం సహజం. కాని తిక్కన ఇవికాక మరికొన్ని అంగములు (విభాగములు) పాల్గొన్నట్లు గుర్తించాడు. ఆయన తన నిర్వచనోత్తరరామాయణంలో యుద్ధము నందు సప్తాంగములనుగూర్చి వర్ణించినట్లు చెప్పబడింది. చతురంగబలములలో గజబలము ముఖ్యమైనది. సేనలు యుద్ధభూమికి నడచేటప్పుడు అగ్రభాగంలో గజదళాన్ని నడపడం, ఏనుగుల మెడలలో గంటలు, గుఱ్ఱములకాళ్ళకు గజ్జెలు కట్టడం అచారం.

శంఖములు :

యుద్ధమునందు వీరులు తమ సమరోత్సాహానికి,విజయోత్సవానికి, సంకేతంగా శంఖములను పూరిస్తారు. కృష్ణుని శంఖముపేరు పాంచజన్యం, ధర్మరాజు శంఖముపేరు అనంతవిజయం, భీముని శంఖముపేరు పౌండ్రము, అర్జునుని శంఖముపేరు దేవదత్తము, నకులుని శంఖముపేరు సుఘోషము, సహదేవుని శంఖముపేరు మణిపుష్పకము. వీటిలో పాండవులకు అద్భుతమైన సభను నిర్మించి యిచ్చిన మయుడే అర్జునునకు దేవదత్తాన్ని, భీమునకు గొప్పదైన గదను యిచ్చాడు. కురుక్షేత్రయుద్ధమున చివర భీముడు దుర్యోధనుని తొడలు విరుగగొట్టిన తరువాత,పాండవులు తమవిజయానికిసంకేతంగా తమతమ శంఖములను పూరించడం విశేషం.

చిత్రసేనుడు :

మహాభారతంలో చిత్రసేనుని పేరుతో చాలామంది యోధులున్నారు. ధృతరాష్ట్రుని పుత్రుడు, కర్ణునిపుత్రుడు, పరీక్షన్మహారాజు పుత్రుడు, అభిసారదేశపురాజు, త్రిగర్తరాజు సుశర్మకు సోదరుడు, పాంచాలదేశపురాజు, నాగవంశీయుడైనరాజు, గంధర్వరాజు, జరాసంధునకు నీతి విశారదుడైన మంత్రి, వీరందరిపేర్లు చిత్రసేనుడే!

.............

## భీష్మపర్వం :

కురుక్షేత్రయుద్ధమునకు ముందు భీష్ముడు శాపగ్రస్తుడైన కర్ణుని అర్థ రథునిగా సంభావించాడు. దానికి కోపించిన కర్ణుడు భీష్ముడున్నంతవరకు తాను యుద్ధరంగం లో అడుగుపెట్టనని ప్రతిజ్ఞచేశాడు. భీష్ముడుకూడా యుద్ధరంగంలో తానున్నంతవరకు కర్ణుడు కాని, వాని బంధువులుకాని, యుద్ధంలో పాల్గొనరాదని, పలికాడు. పదవనాడు యుద్ధరంగంలో భీష్ముని పతనానంతరం కర్ణుడు వానిని కలసి, వానికి పాదాభివందనంచేయగా, భీష్ముడు వానిని లోకోత్తరవీరునిగా ప్రశంసించడం గమనించదగినది. కురుక్షేత్రయుద్ధంలో పాల్గొన్నవీరులలో పాండవుల, కౌరవులపై అభిమానంతో వారిపక్షాలలో చేరినవారేకాక, పూర్వవైరాన్నితలచి, ఒకే ప్రదేశంలోనివారుకూడా రెండు పక్షాలలోనూచేరడం విశేషం. ఉదాహరణకు యాదవవంశంలో శ్రీకృష్ణుడు, సాత్యకి పాండవపక్షంలో చేరగా, కృతవర్మ కౌరవపక్షంలో చేరాడు.

## యుద్ధనియమములు,నీతులు :

సర్వసైన్యాధ్యక్షునిగా భీష్ముని మొదటినాటియుద్ధమునకు ముందే సైన్యము కొన్ని యుద్ధనియమాలు ఏర్పరచుకున్నారు.

***'యుద్ధముచేయునపుడు అవసరానికి తగిన మాటలాడుతున్నపుడు శత్రువుపై నందుమానుకుని ఆయుధప్రయోగం వేయరాదు, యుద్ధముచేసేటపుడు క్రింద పడిపోయినవానిపై ఆయుధప్రయోగము వేయరాదు.చేతిలో కత్తి నేలపై పడినపుడు శత్రువును సంహరింపరాదు, పిరికితనంతో యుద్ధం వదలిపెట్టి పారిపోయేవారిని, భయపడినవారిని ఎట్టి శత్రువునైనా సంహరించరాదు'***

***( భీష్మపర్వం...ప్రథమాశ్వాసము...148 పద్యము... 'బవరము సేయుమండిన...నెట్టిశత్రునిన్.')***

యుద్ధము సూర్యోదయంతో ఆరంభమై, సూర్యాస్తమయంతో ముగియడం యుద్ధనియమం. భోజనవిరామము వర్ణింపబడలేదు కనుక నిర్విరామముగా, నిరాహారముగా యుద్ధముజరిగినట్లు భావించాలి. అంతేకాక, ఎదురుదాడి, ఆత్మరక్షణ, మాయాయుద్ధనీతి, ద్వంద్వయుద్ధనీతి, మూకుమ్మడియుద్ధనీతి అని యుద్ధనీతులు ఐదు రకాలుగా చెప్పబడ్డాయి.

యుద్ధమునకుముందు ధర్మరాజు 'కౌరవపక్షంనుండి, మా పక్షం లోనికి ఎవరైనా వచ్చిచేరితే వారికి మా హృదయపూర్వకస్వాగతమని' పలికాడు. అప్పుడు కౌరవపక్షంనుండి, యుయుత్సుడనువాడు తన సైన్యంతోవచ్చి పాండవపక్షంలోచేరడం విశేషం. ఇతడు కౌరవులలో ఒకడు, కురుక్షేత్ర యుద్ధానంతరం పాండవపక్షాన మిగిలిన వారిలో ఒకడు.

## యుద్ధరీతులు :

ఉపాయము, బలము, వేగము ఇవి యుద్ధరంగంలో యుద్ధవీరులకుండవలసిన లక్షణాలు.

ఒకవీరుడు, మరొకవీరుడితో పోరాడడం ' ఎక్కడికయ్యం '. ఇద్దరు మరో ఇద్దరితోకాని, ఐదుగురు మరో ఐదుగురితోకాని పోరితే అది ' క్రందటిపోరు. '. విందాను విందులు కుంతిభోజుని ఇద్దరు కొడుకులతోను, కేకయరాజ పంచకం గాంధారరాజ పంచకంతో పోరడం వీటికి ఉదాహరణలు.

అట్లే యుద్ధరంగంలో రథికుడు తన రథంపైగల కేతనాన్ని కాపాడు కోవడం ప్రతిష్టాత్మకం. అది ఆ వీరుడి కర్తవ్యం. అతడి పరాక్రమంలో అంతర్భాగం. జెండా పడ గొట్టబడడం అవమానకరం. భీష్ముని మొదటినాటి యుద్ధంలో అభిమన్యుడు భీష్ముని కేతనాన్ని కూలద్రోశాడు.

చతురంగబలాలను కోణములు, వలయాలు మొదలైన వివిధరీతులలో నడిపించడం యుద్ధరీతి. రెండు రేఖలను కలిపేది కోణం, చక్రాకార సంచలనం వలయం. భీష్ముడు తన మొదటినాటి యుద్ధంలో కోణాకార వలయాకారాలలో చలించాడు.

...........

## భీష్ముని మొదటినాటి యుద్ధము :

మొదటినాటియుద్ధంలో కౌరవ,పాండవ సైన్యములనుండిఖడ్గము, బాణములు, ఈటెలు మొదలైన శస్త్రములు ప్రయోగింపబడ్డాయి. పాండవపక్షాన ధృష్టద్యుమ్నుడు అచలవ్యూహాన్ని పన్నాడు. భీష్ముడు పాండవసైన్యం కకావికలయ్యేటట్లు తాను వంపులుగా, కోణాలుగా, వలయాలుగా వివిధరీతులలో తనరథాన్ని నడిపిస్తూ పాండవసైన్యాన్ని చీల్చిచెండాడాడు. ఆనాటి యుద్ధంలో సాత్యకి కృతవర్మను, అభిమన్యుడు బృహద్బలుడిని, భీముడు భీష్ముడిని, సహదేవుడు దుర్ముఖుని, దుశ్శాసనుడు నకులుని, ఎదుర్కోవడంతో కురుపాండవుల మధ్యయుద్ధం సంకులసమరమయ్యింది.

విరాటుని కుమారుడైన ఉత్తరుడు విజృంభించి, శల్యుని ఎదిరించి సారథినిచంపి విరథుని చేశాడు. శల్యుడు కోపంతో 'శక్తి' అనే ఆయుధాన్ని ప్రయోగించి వానిని సంహరించాడు. శంతనుని కొడుకు బాహ్లికుడు, వానికొడుకు సోమదత్తుడు, వానికొడుకు భూరిశ్రవుడు ఆనాటి యుద్ధంలో పాల్గొన్నారు. ఆనాడు ధర్మరాజునకు, శల్యునికి పోరు ఘోరంగా సాగింది. భీష్మునకు, అభిమన్యునకు జరిగినయుద్ధంలో అభిమన్యుడు భీష్మునిరథపు కేతనాన్ని కూలద్రోశాడు. ఇది భీష్మునికి అవమానం.

## భీష్ముని రెండవనాటి యుద్ధము :

కురుక్షేత్రం రెండవనాటి యుద్ధంలో ధర్మరాజు సూచనమేరకు పాండవపక్షాన సర్వసైన్యాధ్యక్షుడైన ధృష్టద్యుమ్నుడు క్రౌంచవ్యూహాన్ని పన్నాడు. ఇది ఒక విలక్షణ వ్యూహం. పూర్వం దేవదానవ సంగ్రామంలో బృహస్పతి, దేవేంద్రునికి ఈ వ్యూహ విశిష్టతనుగూర్చి తెలిపి, శత్రువులకు భయము గొలుపునట్టి దీనిని గూర్చి వివరించాడు. ఇది రెక్కలబలంతో పక్షి ఎగిరినట్లుగా వుంటుంది. దీనికి రెక్కలభాగంలో భీమ, ధృష్టద్యుమ్నులు, పక్షి ముక్కుతో పొడిచిహింసిస్తుంది,కనుక ముక్కుభాగంలో అర్జునుడు, పక్షికి వెన్నుభాగంబలం కనుక వెన్నుభాగంలో ధర్మరాజు నిలిచారు.దీనికి ప్రతివ్యూహమంటూ ఏదీ లేకపోవడంవల్ల, భీష్ముడు తన సేనను త్రిముఖ వ్యూహంతో మూడుభాగాలుగా విభజించి, పాండవసైన్యాన్ని ఎదుర్కొన్నాడు. ద్రోణాచార్య, ధృష్ట

ద్యుమ్నులు, యుద్ధంలో అనేక క్రూరాస్త్రాలను శక్తులను ప్రయోగించారు. భీముడు గద, ఖడ్గ ఆయుధాలతో కౌరవసైన్యాన్ని చీల్చి చెండాడాడు. భీష్ముడు భీముని రథాన్ని విరుగకొట్టగా అతడు రథంమీదనుండి క్రిందికి దుమికి, భీష్మునిపై శక్తి ఆయుధాన్ని ప్రయోగించాడు. కాని భీష్ముడు దానిని భగ్నంచేశాడు. త్రిముఖ వ్యూహంతో భీష్ముడు ఎంత విజృంభించినా అర్జును ని పరాక్రమంవల్ల ఆనాడు పాండవులదే పైచేయి అయ్యింది.

భీష్మ, ద్రోణ, కృపాచార్య, వికర్ణ, శల్య, దుర్యోధనాదులు మూకుమ్మడిగా ఒకేసారి ఎదిరించి, ప్రయోగించిన బాణపరంపరను అర్జునుడు ఎదుర్కొని, అసహాయశూరుడై, ఎందరో వీరులను సంహరించాడు. ధృష్టద్యుమ్నుడు ద్రోణునిపై 'శక్తి' ఆయుధాన్ని ప్రయోగిం చడం నాటి విశేషం. దానిని ద్రోణుడు సమర్థవంతంగా ఎదుర్కొన్నాడు. కళింగరాజు శ్రుతాయువు తమ్ముడైన భానుమంతుని భీముడు తన ఖడ్గంతో సంహరించాడు.ఆనాడు భీముడు యుద్ధ రంగంలో వీరవిహారంచేసి, కౌరవుల త్రిముఖవ్యూహాన్ని చెల్లాచెదురు చేశాడు. భీముడు 'శక్తి' ఆయుధాన్ని భీష్మునిపైకి విసరగా అతడు దానిని మూడుముక్కలు చేశాడు. సాత్యకి 'కనుకట్టు' వంటి ఉపాయంతో ఒక అస్త్రం సంధించి భీష్ముని రథసారథిని చంపగా, గుఱ్ఱాలు అతడిరథాన్ని ఎత్తుకుని యుద్ధరంగంనుండి దూరంగా వెళ్ళిపోయాయి. ఆనాటి భీష్ముని పరాజయానికి భీమ, సాత్యకులు కారకులయ్యారు.

## భీష్ముని మూడవనాటి యుద్ధము :

మూడవనాడు భీష్ముడు గరుడ వ్యూహాన్ని పన్నాడు. తాను ముక్కుభాగాన, ద్రోణ,కృతవర్మలు కన్నులుగ, కృప, అశ్వత్థామలు శిరస్సుగ, శల్య,భగదత్తులు కంఠముగ, దుర్యో ధనుడు వెన్నుగ, విందానువిందులు తోకగ, నిలిచారు. దానికి ప్రతిగ, అర్జునుడు అర్థచంద్ర వ్యూహాన్ని పన్నమని ధృష్టద్యుమ్నునకు సూచించాడు. అర్థచంద్ర ఆకృతిలోని రెండు శృంగా లలో భీమార్జునులు నిలవగా, మధ్యభాగంలో ధర్మరాజు, శిఖండి, ధృష్టద్యుమ్నులు నిలిచారు. కాని భీష్ముని బాణముల ధాటికి ఓర్వలేక పాండవసైన్యం చెల్లాచెదురుకాగా, కృష్ణుడు తన సుద ర్శనచక్రంతో భీష్ముని చంపడానికి సిద్ధపడ్డాడు.

గరుడపక్షినికూల్చాలంటే విల్లయినా కావాలి, లేక బాణమైనా కావాలి. అర్ధ చంద్రాకారబాణం పక్షి కంఠాన్నికాని, కడుపునుగాని చీల్చడానికి అనువుగా వుంటుంది. అందు

వల్ల గరుడవ్యూహాన్ని అర్ధచంద్రవ్యూహంతోనే ఎదుర్కోవాలి. కాని భీష్ముని ప్రతాపంముందు అది నిలబడలేదు. చివరకు కృష్ణుడే తన సుదర్శనచక్రంతో వానిని ఎదుర్కోవలసివచ్చింది. కాని అర్జునుని అనునయంతో కృష్ణుడు ఆప్రయత్నం విరమించాడు. కృష్ణునకు తానిచ్చినమాటకు కట్టుబడి, అర్జునుడు ఆనాడు విజృంభించడంతో, బాణానికి రెండుశిఖలుగావున్న భీమార్జునులు, గరుడవ్యూహ గర్భస్థుడైన దుర్యోధనుని, ముక్కుగావున్న భీష్ముని నొప్పించి గాయపరచడంతో ఆనాటి పాండవుల అర్థచంద్రవ్యూహం సఫలమయ్యింది.

## భీష్ముని నాల్గవనాటి యుద్ధము :

రెండవనాడు, మూడవనాటి యుద్ధాలలో పాండవులదే పైచేయి కావడంతో నాల్గవనాడు భీష్ముడు ఏవ్యూహాన్ని పన్నలేదు. వ్యూహాలేవీలేని నాల్గవనాటి యుద్ధాన్ని 'తుముల యుద్ధం ' అంటారు. ఆనాడు ఖడ్గములు, గండ్రగొడ్డళ్ళు వంటి ఆయుధములతోబాటు 'నఖర ములనే' ఆయుధములు వాడ బడ్డాయి. కనుక ఆనాడు కౌరవ, పాండవులు పరస్పరం ఎదు ర్కొన్న దొమ్మియుద్ధాలే ఎక్కువగా జరిగాయి, ఆనాడు భీమార్జునులను ఎదుర్కోవడం కౌరవులకు కష్టమయ్యింది. అర్జునుడు ఒకేబాణంతో కృతవర్మను, వాని సారథిని, రథాన్ని, గుఱ్ఱాలను భూమి పై కూల్చడం విశేషం. మగధరాజులను అభిమన్యుడు క్రూరమైన భల్లంతో చంపాడు. దుర్యో ధనుడు ప్రయోగించిన బలమైన బాణం భీముని రొమ్మును తాకగా, అతడు మూర్ఛపోయాడు.

భీమునకు, రాక్షసస్త్రీ అయిన హిడింబకు జన్మించిన ఘటోత్కజుడు నాల్గవ నాటి యుద్ధం సాయంసమయంలో విజృంభించి అనేకమంది కౌరవసైన్యాన్ని చంపాడు. రాక్ష సులకు రాత్రి గడిచేకొద్దీ బలంపెరుగుతుంది. ఇదిగ్రహించిన భీష్ముడు ఆనాటి సాయంసమ యానికే యుద్ధం నిలుపుచేయించాడు.

## భీష్ముని ఐదవనాటి యుద్ధము :

ఐదవనాడు భీష్ముడు మకరవ్యూహాన్ని పన్నాడు. ఎదుటి నుండి శత్రువు తమను ఆక్రమించే ప్రమాదం వున్నప్పుడు మకరవ్యూహమే సరియయినదని యుద్ధనీతి. దానికి ప్రతిగా పాండవులు శ్యేన ( డేగ ) వ్యూహాన్ని పన్నారు. మకరానికి తనకాళ్ళు అందించకుండా, శ్యేనం కౌరవసేనను తన ముక్కుతో పొడిచి, రెక్కలతో కొట్టి ధ్వంసంచేయడం దీని లక్ష్యం. ఆనాడు

భీముడు మకరవ్యూహాన్ని ఛేదించి, లోనికి ప్రవేశించి, భీష్ముని ఎదుర్కొన్నాడు. భీష్మునకు సాత్యకికి జరిగిన ద్వంద్వయుద్ధంలో భీష్ముడు సాత్యకిని ఓడించి విరథుని, నిరాయుధుని చేసి, యుద్ధనియమాన్ననుసరించి, వానిని విడిచి ముందుకు సాగిపోయాడు. భీముడు భయంకర మైన చురకత్తులవంటి బాణాలతో దుర్యోధనుని గాయపరిచాడు. లక్ష్మణకుమారుడు 'శక్తి' ఆయు ధాన్ని అభిమన్యునిపై ప్రయోగించగా, అతడు దానిని తన బాణాలతో ఖండించాడు.ఆనాడు అర్జునుడు కూడా తన క్రూరనారాచాలతో కౌరవసేనను కకావికలు చేశాడు. ఈవిధంగా మునుపు శ్యేనవ్యూహం ద్వారా భీష్ముడు సాధించలేని విజయాన్ని అదేవ్యూహంద్వారా పాండవులు పాధిం చారు. తమతాతకు గుణపాఠం నేర్పారు. ఆనాడు అర్జునుని విజృంభణ చూసి భీష్ముడు 25వేల మంది రథికులను, రథములతో వానిపై యుద్ధానికి ప్రోత్సహించాడు. అర్జునుని చుట్టుముట్టిన అవి వాని బాణాగ్నికి మాడిపోయాయి. ఆనాడుకూడా పాండవులదే పైచేయి అయ్యింది.

## భీష్ముని ఆరవనాటి యుద్ధము :

ఆరవనాడు పాండవులు అదే మకరవ్యూహాన్ని పన్నారు. దానికి ప్రతిగా భీష్ముడు క్రౌంచవ్యూహాన్ని పన్నాడు. మకరానికి శిరసుభాగంలో వున్న అర్జునుడు తన శస్త్రాస్త్రా లతో కౌరవసేనను పీడించాడు. క్రౌంచవ్యూహంలో తుండముగావున్న భీష్మ,ద్రోణులు పాండవ సేనను పీడిస్తే, మకరవ్యూహంలో కంఠస్థానంలోవున్న, భీమాదులు కౌరవులను పీడించారు. కాని ఆనాటి యుద్ధంలో కౌరవవ్యూహం విఫలమై, పాండవుల మకరవ్యూహమే జయించింది. ఈ యుద్ధంలో దుర్యోధనుడు, ధృష్టద్యుమ్నుని మీదకు తన సైన్యాన్ని పంపగా, అతడు వారిపై 'ప్రమోహనా'స్త్రాన్ని (సన్మోహనాస్త్రం) ప్రయోగించి, వారికి తెలివితప్పేలా చేశాడు. తరువాత ద్రోణుడు ' ప్రజ్ఞాస్త్రం'తో ఆ అస్త్రాన్ని ఉపసంహరించి, తిరిగి వారికి తెలివి వచ్చేలా చేశాడు. తాత్కాలికంగా తెలివి తప్పేలాచేసి, అచేతనస్థితినికలిగించడం సన్మోహనాస్త్రముయొక్క ప్రభావ మైతే, దానికి విరుగుడు ప్రజ్ఞాస్త్రం.

అంతకుమునుపు ఈ సన్మోహనాస్త్రాన్ని అష్టవసువులు పరశురామునితో ద్వంద్వ యుద్ధసమయంలో భీష్మునకు ప్రసాదించి, ప్రయోగ,ఉపసంహారాలను తెలిపారు. కాని బ్రహ్మాస్త్ర ప్రయోగంతో అతలాకుతలమైన స్థితిలో భీష్ముడు ఈ అస్త్రప్రయోగానికి సిద్ధపడగా నారదుడే వానిని వారించాడు.తిరిగి విరాటపర్వంలో ఉత్తరగోగ్రహణసమయంలో అర్జునుడు కౌరవసేనపై

ఈ అస్త్రాన్ని ప్రయోగించి వారిని మూర్ఛితులను చేశాడు. వారిలో భీష్ముడూ వున్నాడు.ఆనాడు భీమ,దుర్యోధనయుద్ధంలో దుర్యోధనుడు మూర్ఛితుడుకాగా, కృపాచార్యుడు వానిని రక్షించాడు.

## భీష్ముని ఏడవనాటి యుద్ధము :

ఏడవరోజు భీష్ముడు మండలవ్యూహాన్ని పన్నగా, దానికి ప్రతిగా ధర్మరాజు వజ్రవ్యూహాన్ని పన్నాడు. పక్షాలు, కక్షాలు ఉరస్యాలు దగ్గరదగ్గరగా వుంటే అది మండల వ్యూహం. శత్రుసైన్యానికి అభిముఖంగా సమస్తసైన్యము కలసి మూకుమ్మడిగా కదలుతూ అన్ని వైపులకు ప్రసరించడం దీని లక్షణం. ఇరుపార్శ్వాలనుండి ఆక్రమణజరుగుతుందని భయం వున్నప్పుడు వజ్రవ్యూహాన్ని పన్నడం యుద్ధనీతి. చుట్టుముట్టి అన్నివైపులనుండి ఆక్రమించే సైన్యపు మండలవ్యూహాన్ని, పాండవసైన్యం ఇరుపార్శ్వాలను ఆశ్రయించి, సర్వతోముఖంగా విజృంభించి, స్వీయరక్షణతో కౌరవసైన్యాన్ని మట్టుబెట్టి, విజయంసాధించింది.

ఆనాడు ఘటోత్కజుడు భగదత్తునిపై 14 చిల్లకోలలుతోబాటు 'శక్తి' ఆయుధాన్ని ప్రయోగించగా, అతడు వాటిని మధ్యలోనే త్రుంచాడు. తనను చుట్టుముట్టి బాణవర్షం కురిపిస్తున్న కౌరవసైన్యంపై అర్జునుడు ఐంద్రాస్త్రాన్ని ప్రయోగించాడు. రాక్షసుడైన అలంబసుని ఎదుర్కోవడానికి సాత్యకి కూడా అతడిపై ఐంద్రాస్త్రాన్ని ప్రయోగించాడు. ఏడవనాటి యుద్ధంలో దుశ్శాసన, వికర్ణ, చిత్రసేనులతో భయంకరముగా యుద్ధముచేసిన అభిమన్యుడు వారిని ఓడించి, తన తండ్రి ప్రతిజ్ఞ తలచి వారిని ప్రాణాలతో విడిచిపెట్టాడు. ఆనాడు అర్జునుడు త్రిగర్త రాజ్యాధిపతిని ఎదుర్కొని, అతడి32 రథచక్రరక్షకులను 64 బాణాలతో సంహరించాడు. జయద్రథుడు వందలకొలది బాణాలతో భీముని ఆపడానికి ప్రయత్నించి, విఫలమయ్యాడు. తరువాత చిత్రసేన, భీమసేనులమధ్య భయంకర గదాయుద్ధం జరిగింది. భీముడు విసిరిన గద పిడుగువలె, సెగలు,పొగలతో,వెలుగుతూవచ్చి, చిత్రసేనుని, సారథిని,రథాలను, గుఱ్ఱాలను నుగ్గుచేసింది. శిఖండి విజృంభించి, శల్యునిపై మహానలాస్త్రాన్ని ( ఆగ్నేయాస్త్రం ) ప్రయోగించగా, అతడు వారుణాస్త్రంతో త్రిప్పికొట్టాడు. ఆగ్నేయాస్త్రానికి అగ్ని, వారుణాస్త్రానికి వరుణుడు అధిదేవతలు. ఆనాడు భీష్మునకు ధర్మరాజునకు జరిగిన యుద్ధంలో భీష్ముడు, ధర్మరాజును బాణాలతో వాని సర్వాంగాలను నొప్పించగా, ధర్మరాజు వానిపై 'శక్తి'ని ప్రయోగించాడు.

కాని భీష్ముడు దానిని మధ్యలోనే త్రుంచాడు. ధర్మరాజు తనసైన్యాన్ని భీష్మునిపైకి పురికొల్పగా, అతడు తన మండలాకార సంచలనంతో ఆ సైన్యాన్ని చీల్చిచెండాడాడు.

## భీష్ముని ఎనిమిదవనాటి యుద్ధము :

ఎనిమిదవరోజు ద్రోణ, ద్రుపదులయుద్ధము, అలంబసునిచే ఇరావంతుని మరణము, ద్రోణ, ఘటోత్కజుల యుద్ధము, తనపుత్రుడు ఇరావంతుని మృతికి అర్జునుని శోకం ప్రధానాంశములు. ఆనాడు భీష్ముడు కూర్మవ్యూహము పన్నగా, పాండవులు శృంగాటకవ్యూహం పన్నినారు. శత్రువులు పైకురికి నపుడు తాబేలువలె స్వీయ రక్షణోపాయములకు ఈ కూర్మ వ్యూహం తోడ్పడుతుంది. కాని ఈ రక్షణోపాయాలను బట్టబయలుచేసి, మట్టుపెట్టేది శృంగాటక వ్యూహం. శృంగాటకమనగా నాలుగుదారుల కూడలి. పాండవసైన్యం మూడు భాగాలుగా విభజింపబడింది. ఒకదానికి అర్జునుడు, రెండవదానికి అభిమన్యుడు, మూడవదానికి ఘటోత్కజుడు నాయకులు.

ఆనాడు దుర్యోధనుని సోదరుడు సునాభుడనువానిని భీముడు తన గదాఘాతంతో సంహరించగా, వాని సోదరులు ఏడుగురు వానిపై మూకుమ్మడిగా దాడిచేయగా, భీముడు వారందరిని వరుసగా సంహరించాడు. అర్జునునకు నాగకన్య ఉలూచికి పుట్టినవాడు ఇరావంతుడు. అతడు అలంబసుని రాక్షసమాయాయుద్ధాన్ని, తన నాగవంశపు ఇంద్రజాల మాయచే ఎదుర్కొన్నాడు.అతడు వేలకొలది నాగులను సృష్టించగా, అలంబసుడు గరుత్మంతుని రూపంలో ఆ నాగులను తిని, యుద్ధంలో ఇరావంతుని శిరసు ఖండించాడు. అదిచూచి, ఘటోత్కజుడు పెద్దశూలంతో కౌరవసేన నెదుర్కొన్నాడు. దుర్యోధనుడు వానిపై వేగవంతుడు, విద్యుజ్జిహ్వుడు,బహ్వాశి అను రాక్షసులను పంపాడు. అతడు వారినెదుర్కొని, దుర్యోధనునిపై 'శక్తి' ఆయుధాన్ని ప్రయోగించాడు. దుర్యోధనుడు వానిపై ఎఱ్ఱని జ్వాలలు వ్యాపించే ఆయుధాన్ని ప్రయోగించగా అతడు దానిని మధ్యలోనే త్రుంచాడు. ఆనాడు దుర్యోధనుని సైన్యం చాలా నష్టపోయింది.

## భీష్ముని తొమ్మిదవనాటి యుద్ధము :

తొమ్మిదవనాటి యుద్ధంలో భీష్ముడు సర్వతోభద్ర వ్యూహాన్ని పన్నగా, పాండవులు ధృఢవ్యూహాన్ని పన్నారు. నలువైపులనుండి ఆక్రమణభయం వున్నపుడు ఈ సర్వతోముఖ భద్రవ్యూహాన్ని పన్నుతారు. ఆనాటి భీష్ముని పరిస్థితికి అవ్యూహం ప్రతీక. అన్నివైపులనుండి శత్రువులను ఆక్రమించడం దీనివ్యూహవిధానం. ఇది భీకరమైనదాడికి చిహ్నం. దానిని తట్టుకోగలిగేది ధృఢవ్యూహం. కాని భీష్ముని ఈవ్యూహంముందు ధృఢవ్యూహం వీగిపోయింది. ఆనాడు భీష్ముని పరాక్రమంముందు పాండవసైన్యం నిలువలేకపోయింది. వానిని నివారించడం కృష్ణార్జునులకుకూడా సాధ్యంకాలేదు. చివరకు కృష్ణుడే చక్రాయుధంతో వానిని చంపడానికి సిద్ధపడ్డాడు. కాని అర్జునుడు 'ఆయుధము చేపట్టననిన' వాని ప్రతిజ్ఞకు భంగంకలుగకుండా వానిని నివారించాడు. ధర్మరాజే భీష్ముని, వాని వధోపాయం అడగవలసివచ్చింది. శిఖండి కనబడితే యుద్ధం చేయలేనని భీష్ముడు తన వధోపాయాన్ని చెప్పాడు. ఆ శిఖండినే అగ్రస్థానంలో నిలిపి పాండవులు వ్యూహరచనచేశారు. కాని అది ఫలించలేదు. ఈవిధంగా సర్వతోముఖభద్రవ్యూహం ఆనాడు సఫలమయ్యింది.

అభిమన్యుడు మండలాకారంగా తిరుగుతూ కౌరవసేనను, అలంబసుడనే రాక్షసుని మాయాయుద్ధాన్ని గొప్పవైన తన దివ్యాస్త్రాలతో ఎదుర్కోవడం,ఆనాటి విశేషం. అలంబసుడు జటాసురుని కుమారుడు, బకుడు, కిమ్మీరుల తమ్ముడు. అలంబసుని మాయచేత యుద్ధభూమి అంతా చీకటి అలముకోగా, అభిమన్యుడు సూర్యసంబంధమైన అస్త్రంతో దానిని పటాపంచలు చేశాడు. త్రిగర్తరాజుకుమారులను చెల్లాచెదురు చేయడానికి అర్జునుడు వాయువ్యాస్త్రాన్ని ప్రయోగించగా, దానికి ప్రతిగా ద్రోణుడు శైలాస్త్రాన్ని ప్రయోగించాడు. భీష్ముడు సాత్యకిమీదకు 'శక్తి' ఆయుధాన్ని ప్రయోగించగా అతడు దానిని పట్టుకొని తిరిగి వానిమీదకే విసిరాడు. భీష్ముడు దానిని మధ్యలోనే త్రుంచాడు. ఆనాటి రాత్రి తనను దర్శించి, తన వధోపాయమడిగిన ధర్మరాజుతో భీష్ముడు తనను జయించడానికి శిఖండిని ఎదురుగాచేసి, అర్జునుని తనతో యుద్ధానికి తలపడమని, అది తన ఆజ్ఞగా చెప్పాడు.

## భీష్ముని పదవనాటి యుద్ధము :

తొమ్మిదవనాటి రాత్రి భీష్ముడు తనవద్దకు వచ్చిన ధర్మరాజుతో చెప్పిన తన ఆత్మవధోపాయానికి అనుగుణంగా అర్జునుడు శిఖండి నడ్డుగాచేసికొని తనశరపరంపరతో భీష్ముని శరతల్పగతుని చేశాడు. కనుక భీష్మునిది ఆత్మవధవ్యూహం, పాండవులది శిఖండి వ్యూహం. శిఖండి తనపై ఎన్ని క్రూరాస్త్రాలు ప్రయోగించినా, భీష్ముడావైపు చూడక, యుద్ధ విముఖుడయ్యాడు. అప్పటికే అలసిపోయిన అతడే శిఖండిని ఎదురుగా నిలిపి అర్జునునిచే దాడిచేయించమని ధర్మరాజును కోరాడు. అర్జునుడు, భీష్మునికి రక్షణగా తననెదుర్కొనిన శల్య, కృతవర్మ, చిత్రసేనాది కురువీరులపై ఐంద్ర, వారుణ, ఆగ్నేయాది అస్త్రాలను ప్రయోగించి, వారిని తరిమికొట్టాడు. శిఖండి ఎన్ని క్రూరాస్త్రాలు వేసినా, భీష్ముడువానిని కన్నెత్తి చూడక, అర్జునునిపై 'ఉగ్రశక్తి'ని ప్రయోగించాడు. అతడు దానిని మధ్యలోనే త్రుంచాడు. చివరకు అర్జునుడు బ్రహ్మదండాలవంటి తన అస్త్రాలతో భీష్ముని యుద్ధరంగంలో పడగొట్టాడు .అతడి శరీరం నేలనుతాకకుండా బాణాలే పాన్పుగా అమరాయి. సత్యవతీవివాహసమయంలో తనతండ్రి తనకు వరంగా యిచ్చిన ' ఇచ్ఛామరణం ' ప్రభావంతో వానిప్రాణత్యాగం వాని వశమైవుంది. వానితల క్రిందకు వ్రేళ్ళాడకుండా, అర్జునుడు మూడు అభిమంత్రించిన బాణాలతో వానికి తలగడ అమర్చాడు. ఉత్తరాయణ పుణ్యఘడియల వరకు తాను అంపశయ్యపై వుంటానని, తనకు పరిఖలతో రక్షణ కల్పించమని, తగినవారిని కాపలా పెట్టమని అతడు కోరగా పాండవులు వానికి కావలసినవి సమకూర్చారు.

భీష్ముని దాహం తీర్చడానికి, బాణముల వలన కలిగిన తన శరీరబాధ పోగొట్టడానికి అర్జునుడు పర్జన్యమంత్రాన్ని పఠించి, దానిని ఒక బాణంపై అభిమంత్రించి, ప్రయోగించాడు. అది భూమినిచీల్చి, దివ్యసుగంధభరితమైన పాతాళగంగను వెలికితీసింది.అది ధారలుగ పైకిలేచి, భీష్ముని దప్పిక తీర్చింది. భీష్మునియుద్ధరంగ నిష్క్రమణతో, ద్రోణపర్వం ప్రారంభమై, అతని సర్వ సైన్యాధ్యక్షతన కర్ణుడు యుద్ధరంగంలోకి అడుగుపెట్టాడు.

............

## ద్రోణపర్వం :

*ద్రోణపర్వం- రౌద్రరసమహార్ణవం. క్రూరస్వభావ ప్రదర్శకం. ద్రోణాభిషేకం, సంశప్తకవధ, అభిమన్యువధ, ప్రతిజ్ఞాపర్వం, జయద్రథవధ, ఘటోత్కచవధ, ద్రోణవధ, నారాయణాస్త్ర ప్రయోగం మొదలైనవి ఈ పర్వ విశేషాలు. ద్రోణుడు శుక్రుని అంశతోను, ద్రుపదుడు వాయుదేవుని అంశతోను జన్మించారు. కౌరవులు చేసిన అపచారంవల్ల ( అభిమన్యవధ ) పాండవహృదయాలలో ప్రత్యేకించి అర్జునుని హృదయంలో ఉప్పొంగిన ప్రజ్వలన రూపమైన క్రోధం, ఈపర్వ కథకు కేంద్రం. ఈపర్వం క్రూర స్వభావ ప్రదర్శకంగా సాగిందని వ్యాసమహర్షి సూచించాడని ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారు పేర్కొన్నారు. '*

**(ద్రోణపర్వం...డా. జి. హరిహరనాథ్...పీఠిక...పుట. 2......తి.తి.దే. ప్రచురణ...హైదరాబాద్.)**

' ద్రోణపర్వ పలాశవాన్ ' అని నానుడి. పలాశవాన్ అనగా విస్తారముగా వీరులను నాశనము చేయునది అని అర్థము. ఈ పర్వంలో క్రౌర్యానికి ప్రతిరూపాలైన రాక్షసాంశ కలిగిన కౌరవపక్షంలోని అలంబసుడు, పాండవపక్షంలోని ఘటోత్కజుడు ఇరుపక్షసైన్యాలను నాశన మొనర్చి మరణించారు. ఇది ద్రోణుడు సర్వసైన్యాధ్యక్షుడైన కాలంలో జరిగింది. ఒకవిధంగా కురుక్షేత్రంలో అధర్మయుద్ధం యుద్ధరంగంలో భీష్ముని పతనంనుండే మొదలయ్యింది. ద్రోణుడు భరద్వాజునినుండి ధనుర్విద్యను, అగ్నివేశుడనే మహర్షిని సేవించి, అనేక దివ్యాస్త్రాలను, అట్లే పరశురాముని సేవించి, దివ్యాస్త్ర సంపదను పొందాడు. తనను అవమానించిన ద్రుపదుని అర్జునునిచే బంధింపచేసి, వాని కన్నులు తెరిపించినప్పటికి, యుద్ధకాలానికి అది క్రోధంగామారి వానిలో బ్రాహ్మణ సహజమైన సాత్వికస్వభావంపోయి, క్షత్రియోచితమైన రౌద్ర స్వభావం అలవడింది. శుక్రాచార్యాంశ కలిగిన అతడు తన బ్రాహ్మణతత్వానికి విరుద్ధంగా ప్రవర్తించాడు. అతడు కౌరవపక్షాన యుద్ధంచేసినా, పాండవులకు జయంకలగాలన్న తనఆశీస్సుకు విరుద్ధంగా ప్రవర్తించడు. ద్రోణుని చంపడానికి ద్రుపదునకు వరప్రభావంతోపుట్టిన ధృష్టద్యుమ్నుడు పాండవపక్షంలోనే వున్నాడు.కనుకనే యుద్ధానికిముందు తనవద్దకువచ్చిన ధర్మరాజుతో ద్రోణుడు ' పాండవులు తనపై ప్రయత్నించి యుద్ధంసాగిస్తే జయం తప్పక లభిస్తుందని,' పలికాడు.

భీష్ముని అనంతరం సర్వసైన్యాధ్యక్ష పదవిని కర్ణునకు కాదని తనకు ఇచ్చి నందుకు ( నిజానికి ఇది దుర్యోధనునకు కర్ణుడు సూచించిందే! ) సంతోషించిన ద్రోణుడు ***'యుద్ధంలో ధర్మరాజును ప్రాణాలతో బంధించి ఇవ్వటట్లు'*** దుర్యోధనునకు వరమిచ్చాడు. దానివల్ల ధర్మరాజును తిరిగి జూదమాడించి, కురుసామ్రాజ్యాన్ని శాశ్వతంగా పాలించవచ్చని దుర్యోధనుని దురాలోచన. అర్జునుడు యుద్ధరంగంలో లేకపోతే ధర్మరాజును తాను బంధించ గలనన్నాడు ద్రోణుడు. కనుక ధర్మరాజును పట్టివ్వడం ద్రోణునివంతు, దానికి వీలుగా అర్జునుని యుద్ధరంగానికి దూరంచెయ్యడం దుర్యోధనుని వంతు. దానిఫలితమే పద్మవ్యూహరచన.

## ద్రోణుని మొదటినాటి యుద్ధము :

సర్వసైన్యాధ్యక్షునిగా ద్రోణుడు మొదటిరోజు శకటవ్యూహాన్ని పన్నాడు. రెండు కక్షాలు, రెండు పక్షాలు, ఉరస్యం, ప్రతిగ్రహం అని దీనిలో ఆరుభాగాలు. కాని పాండవులది బృహస్పతిమతం. పూర్వం దేవదానవయుద్ధంలో కూడా బృహస్పతి ఇట్టి వ్యూహాలు రచించిన వాడే! ధర్మరాజును బంధించడానికి శకటవ్యూహమే సరిఅయినది. ఇందు కర్ణుడు బండిలాగే అశ్వం, వెనుక దుర్యోధనుడు దాని సారథి. దుశ్శాసనాది కురువీరులు చుట్టూ రక్షణ. ఇందు ధర్మరాజు కనుక పట్టుబడితే వానిని రక్షించేది ఆకాశంలో ఎగురుతూ శకటాన్ని ఛేదించేది, రక్షించేది క్రౌంచవ్యూహం. అందువల్ల పాండవులు క్రౌంచవ్యూహం పన్నారు. కాని ఆనాడు ధర్మరాజు పట్టుబడకుండానే యుద్ధం ముగిసింది. ఆనాటి యుద్ధంలో శల్యుడు 'శక్తి' ఆయుధాన్ని అభిమన్యునిమీదకు ప్రయోగించగా, అతడు దానిని పట్టుకుని తిరిగి వానిమీదకు విసిరేశాడు.

## ద్రోణుని రెండవనాటి యుద్ధము :

రెండవనాడు సుశర్మ, సంశప్తకులు అర్జునుని యుద్ధానికి ఆహ్వానించారు. అర్జునుడు ధర్మరాజును ఒప్పించి వారితో పోరుకు వెళ్ళాడు. ఆనాడు ద్రోణుడు అర్ధమండలాకార వ్యూహాన్ని పన్నగా, పాండవులు గరుడవ్యూహాన్ని పన్నారు. నాటి యుద్ధంలో భగదత్తుని 'సుప్రతీకమనే 'భద్రగజం పాండవసైన్యాన్ని నాశనంచేస్తుంటే, అర్జునుడు సంశప్తకులతో యుద్ధాన్ని ఆపి, యుద్ధరంగానికివచ్చి, ఆ ఏనుగును చంపాడు. అర్జునుడు యుద్ధరంగానికి తిరిగిరావడంవల్ల, ధర్మరాజును పట్టి బంధించాలన్న ద్రోణుని శపథం రెండవనాడుకూడా నెరవేరలేదు,

అర్జునుడు విశ్వకర్మయిచ్చిన మహాస్త్రాన్ని ప్రయోగించగా, దానిమహిమతో కౌరవసైనికులు గాండీవధారియైన అర్జునునివలె, ఒకరికొకరు కనిపించారు. కనుక వారు ఒకరికొకరు వాడియైన శస్త్రాలతో ఖండించుకుని మరణించారు. తరువాత ఆమహాస్త్రం శాంతించింది. తిరిగి అర్జునుడు తననుఎదిరించిన సంశప్తకులను వాయువ్యాస్త్రాన్ని ప్రయోగించి చెల్లాచెదురు చేశాడు. భగదత్తుడు 'శక్తి' ఆయుధాన్ని కృష్ణునిపై ప్రయోగించగా, అర్జునుడు దానిని మధ్యలోనే ముక్కలు చేశాడు. తిరిగి భగదత్తుడు ఒక అంకుశంపై వైష్ణవాస్త్రాన్ని అభిమంత్రించి ప్రయోగించగా అది అర్జునునకు తగలకుండా కృష్ణుడు తన శరీరాన్ని అడ్డుగా నిలిపాడు. అది కృష్ణుని వక్షస్థలంపై పుష్పంవలె ప్రకాశించింది. అర్జునుడు వజ్రాయుధం వంటి అర్ధచంద్రబాణంతో భగదత్తుని, వాని 'సుప్రతీకమనే' గజాన్ని సంహరించాడు. కర్ణుడు తనపైప్రయోగించిన ఆగ్నేయాస్త్రాన్ని అర్జునుడు వారుణాస్త్రంతో ఎదుర్కొన్నాడు.

## ద్రోణుని మూడవనాటి యుద్ధము :

మూడవరోజు అర్జునుని యుద్ధరంగానికి రాకుండా నిలువరించమని ద్రోణుడు దుర్యోధనునికి చెప్పాడు. ఆవిధంగా వానిని ఆపగలమని సంశప్తకులు వానికి మాట యిచ్చారు. కనుక ద్రోణుడు ఆనాడు పద్మవ్యూహాన్ని పన్నాడు. ఇది ప్రతివ్యూహం లేనిది, దుర్భేద్యమైనది, జటిలమైనది, దానిని ఛేదించగల సామర్థ్యం కృష్ణార్జునులకు మాత్రమేవుంది. అభిమన్యునకు దానిని ఛేదించే రహస్యం తెలుసు, కాని క్షేమంగా తిరిగిరాగల సామర్థ్యం లేదు. అందు ప్రవేశించడం ఎంతకష్టమో, తిరిగిరావడంకూడా అంతేకష్టం. మునుపటిరోజువలె అర్జునుడు వచ్చి సాయంచేసే అవకాశంలేదు. దానిలో ప్రవేశించడానికి ఒక్కటే మార్గం. ఆక్కడ ద్రోణుడున్నాడు. ఒకసారి లోపలికి చొరబడితే ధర్మరాజుతోబాటు పాండవులందరూ బంధింపబడతారు. ద్రోణుని ఆశయం నెరవేరుతుంది. కనుక పాండవులకు కూడా అభిమన్యుని వెంట దానిలో ప్రవేశించి, దానిని భగ్నంచెయ్యడంతప్ప మరోమార్గంలేదు.

అభిమన్యుడు పద్మవ్యూహంలోనికి ప్రవేశించగానే సైంధవుడు, పరమశివుడు తనకిచ్చిన వరప్రభావంచేత పాండవులెవ్వరూ దానిలోకి ప్రవేశించకుండా నిలువరించగలిగాడు. వారినుండి అభిమన్యునికి సాయం అందకుండా చేశాడు. అభిమన్యుడు ' గాంధర్వి ' అను మాయను ప్రయోగించి, కౌరవసేనను ఒంటరిగానే ఎదిరించాడు. ఆమాయ ప్రభావంవల్ల

రాజులకు ఎన్నో రథాలు తమను చుట్టుముట్టి ఎన్నో అస్త్రశస్త్రాలు తమపై ప్రయోగించినట్లు అనిపించింది. అభిమన్యుడు తనను ఎదుర్కొనిన కర్ణుని ' కర్ణికలు ' అను బాణాలతో నొప్పిం చాడు.అభిమన్యుని పరాక్రమంముందు ధర్మరాజు బంధించే ఆలోచన మరుగున పడింది. 'కవచధారణం' అనేవిద్యను ద్రోణుడు అర్జునునికి నేర్పాడు. అతడు దానిని తనపుత్రుడు అభి మన్యునకు నేర్పాడు. దానిప్రభావంవల్ల అభిమన్యుని ఎదిరించడంకష్టం. కనుక వంచనచేసి, వానిని మట్టుబెట్టడం ఒక్కటే మార్గం. అల్లెత్రాడుత్రెంచి, విల్లువిరిచి, సారథిని, గుఱ్ఱాలనుకూల్చి, ఒక్కుమ్మడిగా ఎదుర్కొని, అభిమన్యుని వధించే కపటోపాయం ద్రోణుడే చెప్పాడు. కర్ణుడు, ద్రోణుడు, కృపుడు, శకుని, కృతవర్మ, శల్య,,బాహ్లిక, అశ్వత్థామలు మూకుమ్మడిగా ఎదిరించి, అధర్మంగా అభిమన్యవధకు కారణమయ్యారు,ఈవిధంగా కురుక్షేత్రయుద్ధంలో ప్రత్యక్ష అధర్మ యుద్ధానికి నాందిపలికినవాడు ద్రోణుడు.

## ద్రోణుని నాల్గవనాటి యుద్ధము :

అభిమన్యవధకు కారణమైన సైంధవుని సూర్యాస్తమయంలోగా సంహరిస్తా నని, విఫలమైతే అగ్నిప్రవేశం చేస్తానని, అర్జునుడు శపథం చేశాడు. కనుక నాల్గవనాడు కౌరవు లకు ధర్మరాజును బంధించడంకంటె అభిమన్యునివధకు కారణమైన సైంధవుని, అర్జునుని బారినుండి రక్షించుకోవడం ప్రధానమయ్యింది. సూర్యాస్తమయంలోగా వానికంటబడకుండా రక్షించగలిగితే అర్జునుని అగ్నిప్రవేశం,ధర్మరాజును బంధించడం రెండూసాధ్యమే! కనుక శకట, పద్మవ్యూహాలను కలుపుతూ ద్రోణుడు 'సూచీ' వ్యూహాన్ని పన్నాడు. ఇది వ్యూహత్రయం. అర్జు నుడు మొదట దానిని ధ్వంసంచేసి, తనగురువు ద్రోణుని అల్లెత్రాడుత్రెంచి, విల్లువిరిచి, వానికి ప్రదక్షిణంచేసి, వానికి నమస్కరించి, అతడు చూస్తూండగానే శకటవ్యూహంలోకి ప్రవేశించి, అంచెలంచెలుగా కౌరవవ్యూహాలను ధ్వంసంచేశాడు.

అదిచూచి, దుర్యోధనుడు ద్రోణుని, తన ప్రియశిష్యుడని అర్జునుని పట్ల ఉదాసీనంగా ప్రవర్తిస్తున్నాడని నిందించగా, అతడు వానికి 'సహజకవచశక్తిని' ప్రసాదించి, అర్జునుని ఎదుర్కొమ్మన్నాడు. దానిప్రభావంతో దుర్యోధనుడు విజృంభించి యుద్ధంచేస్తుంటే దానికి కారణంగ్రహించిన అర్జునుడు ఆకవచాన్ని ఛేదించడానికి ప్రయత్నించాడు. దానిని అశ్వత్థామ వమ్ముచేశాడు. కాని అర్జునుడు తొమ్మిది దివ్యబాణాలు ప్రయోగించి దుర్యోధనుని

కవచాన్ని ఛేదించాడు. తరువాత యుద్ధరంగంలో అర్జునుని రథపుగుఱ్ఱాలు అలసిపోయినపుడు వాటి దప్పికతీర్చడంకోసం అతడు తన దివ్యాస్త్రాలతో ఒక సరోవరం కల్పించి వాటి దప్పిక తీర్చాడు. ఆనాడు ద్రోణ,ధృష్టద్యుమ్నులమధ్య పోరు ఘోరంగాసాగింది. అర్జునుడు తన మహాస్త్రాలతో విందానువిందులను సంహరించాడు. ఆనాడు ఘటోత్కజునకు, అలంబసునకు మధ్య జరిగిన మాయాయుద్ధంలో ఘటోత్కజుడు అలంబసుని సంహరించాడు.

సైంధవుని కనబడనీయకుండా కాలయాపనచేస్తున్న కౌరవుల ఆలోచన గమనించి, కృష్ణుడు మాయాతిమిరాన్ని కలిగించాడు. దానిని ఆశ్చర్యంగా చూస్తున్నసైంధవుని తలను అర్జునుడు బాణంతో ఛేదించాడు. వానితల నేలమిదపడితే, వానితండ్రి వృద్ధక్షత్రుడిచ్చిన శాపాన్ననుసరించి అది తనకు ప్రమాదం కనుక, తన చిత్రవిచిత్ర బాణనైపుణ్యంతో దానిని ఆకాశంలోనే నిలుపుతూ, కృష్ణుని సూచనమేరకు అర్జునుడు 'పాశుపతాస్త్రాన్ని' సంధించి, వాని తలను వృద్ధక్షత్రుని ఒడిలో పడేటట్లు ప్రయోగించగా తనపుత్రునితల ఒడిలోపడి అతడు మర ణించాడు. దానివల్ల వృద్ధక్షత్రుడు తనశాపానికి తనే బలిఅయ్యాడు.ఈవిధంగా అర్జునుడు తన పుత్రుడు అభిమన్యుని వధకు ప్రతీకారం తీర్చుకున్నాడు.

## ద్రోణుని ఐదవనాటి యుద్ధము :

ద్రోణుడు ఆనాడు ఏవ్యూహాలూ పన్నలేదు. పన్నినా ప్రయోజనంలేదని తెలుసు. తనకంటె కర్ణుడే సమర్థుడని దుర్యోధనుని చేతనూ నిందింపబడ్డాడు. అతడుఆనాడు ద్రుపదుని, ధృష్టద్యుమ్నుని సంహరిస్తానని శపథం చేశాడు. తనమాటప్రకారం విరాటుని, ద్రుపదుని సంహ రించాడు. ఆనాడు అశ్వత్థామ కాలదండంవంటి బాణంతో ఘటోత్కజుని మూర్ఛపొందేటట్లు చేశాడు. సాత్యకి సోమదత్తుని ద్వంద్వయుద్ధంలో చంపాడు.ఆనాడు ఘటోత్కజుడు విజృంభించి యుద్ధంచేస్తూ అలాయుధుడనే రాక్షసుని చంపాడు. వాని విజృంభణ చూసి కౌరవసేన ఆనాడే అంతమయ్యేటట్లు కనబడింది. అదిచూచి దుర్యోధనుడు కర్ణుని ఇంద్రుడిచ్చిన 'శక్తి' అస్త్రాన్ని వానిపై ప్రయోగించమన్నాడు. కానిదానిని కర్ణుడు అర్జునవధకోసం ప్రయోగించాలనుకున్నాడు. కాని అంతవరకు ఘటోత్కజుని విజృంభణముందు కౌరవసేన నిలువదనితలచి, విధిలేక దానిని వానిపై ప్రయోగించగా ఘటోత్కజుడు మరణించాడు. అర్జునునికి గండం గడిచినందుకు కృష్ణుడు సంతోషించగా, పాండవులు దు:ఖించారు.

యుద్ధమునకుముందు 'నమ్మదగినవ్యక్తివలన మిక్కిలి దుస్సహమైన కీడు మాట విన్నపుడు నేను అస్త్రశస్త్రాలు సన్యసిస్తాను' అనిన ద్రోణుడు తనతో పలికిన పలుకులు తలచిన ధర్మారాజు ఆనాటి యుద్ధంలో భీముడు 'అశ్వత్థామ' అనే ఏనుగును చంపడంచూచి, 'అశ్వత్థామ హతః' అని బిగ్గరగానూ, 'కుంజరః' అని మెల్లగానూ అన్నాడు. నమ్మదగిన ధర్మ రాజుమాటలువిని మరణించినది తనపుత్రుడు అశ్వత్థామగా తలచి ద్రోణుడు యుద్ధరంగంలో తనరథంలోనే అస్త్రసన్యాసం చేశాడు. ధృష్టద్యుమ్నుడు అధర్మంగా, కృష్ణుడు, పాండవులు వారించినా వినక, యోగాసనంలోవున్న ద్రోణుని శిరస్సు ఖండించాడు. అదిచూచి, అశ్వత్థామ నారాయణాస్త్రాన్ని ప్రయోగించాడు. పాండవులతోబాటు వానిసైన్యమంతా నేలపై దిగి, దానికి భక్తితో నమస్కరించారు. భీముడు మొదట వ్యతిరేకించినా, కృష్ణార్జునుల హితోక్తులు విని, దానికి తలవంచాడు. అశ్వత్థామ తిరిగి ఆగ్నేయాస్త్రాన్ని ప్రయోగించగా అర్జునుడు దానిని బ్రహ్మాస్త్రంతో వమ్ముచేశాడు. ఈవిధంగా ద్రోణవధతో ద్రోణపర్వం సమాప్తమయ్యింది.

................

# కర్ణపర్వం

పాండురాజుతో వివాహము కాకముందు, దూర్వాసుడిచ్చిన మంత్రప్రభావముతో సూర్యునివలన కుంతీదేవికి పుట్టినవాడు కర్ణుడు.నాటి సమాజమునకు భయపడిన, ఆమె సహజకవచకుండలములతో శోభించువానిని ఒక తొట్టెలోవుంచి, గంగానదిలో వదలింది. అది ఒక సూతునకు (రథచోదకుడు) దొరకగా అతడు వానిని పెంచెను. సకల శస్త్రాస్త్రవిద్యలు నేర్చి, పరశురాముని చేరి, తాను బ్రాహ్మణుడనని వానిని మోసగించి వానినుండి అనేక దివ్యాస్త్రములను పొందెను. లక్ష్యసాధనకు కుటిలత్వము, కపటము కూడనివి. అది నీచలక్షణము. కనుకనే అతడు వాని మోసము గ్రహించి, అవసర సమయంలో అవి స్ఫురించకుండునట్లు శపించెను. కర్ణుడు ఒక బ్రాహ్మణుని యజ్ఞధేనువును పొరపాటున చంపినందుకు అతడు యుద్ధమునందు రథచక్రం నేలలో క్రుంగపోతుందని, ఎవరిని గెలవాలని, చంపాలని శ్రమిస్తావో, వాని చేతిలోనే చంపబడతావని కర్ణుని శపించాడు.

కురుపాండవ అస్త్రవిద్యాప్రదర్శన సమయంలో అర్జునునివలె తానుకూడా తన విద్యనుప్రదర్శించి, వానితో ద్వంద్వయుద్ధానికి అనుమతికోరగా, అతడు క్షత్రియుడు కాదని వానిని ద్రోణుడు తిరస్కరించెను. ఆసమయంలో దుర్యోధనుడు వానిని అంగరాజ్యానికి రాజుగా అభిషేకించెను. తన అభిమానాన్ని కాపాడిన దానికి కృతజ్ఞతగా కర్ణుడు స్నేహధర్మంతో వానికే తన జీవితమును అంకితముచేసెను. కర్ణుడు అర్జునుని తప్పక జయించగలడని దుర్యోధనుని నమ్మకము.దానికితగినట్లు ద్రోణుని మరణానంతరము దుర్యోధనుడు కర్ణుని సర్వసైన్యాధ్యక్షుని చేసెను.

## కర్ణుని మొదటినాటి యుద్ధము :

మొదటినాటి యుద్ధంలో కర్ణుడు మకరవ్యూహాన్నిపన్నాడు. స్వయంగా అతడే మకరపు నోటిభాగంలో నిలిచాడు. రెండు కన్నులుగా శకుని, వానికుమారుడు ఉలూకుడు, తలభాగంలో అశ్వత్థామ, ఉదరమువద్ద దుర్యోధనుడు నిలిచారు. దానికి ప్రతిగా పాండవులు అర్ధచంద్రవ్యూహాన్ని పన్నారు. దానికి శృంగాలుగా భీమ, ధృష్టద్యుమ్నులు మధ్య అర్జునుడు నిలిచిరి. ఆనాడు ద్వంద్వయుద్ధాలే ఎక్కువగా జరిగాయి. భీముడు వజ్రశరీరం కలవాడు. ద్రోణునిబాణాలూ, కర్ణునిబాణాలూ వానిశరీరాన్ని ఏమీచేయలేకపోయాయి. ఆనాటియుద్ధంలో

కరూశరాజు ప్రయోగించిన బాణవర్షం కూడా అతడినేమీచేయలేకపోయింది. అతడిని భీముడు తన గదాప్రహారంతో సంహరించాడు.

అనాటి యుద్ధంలో నకులుడు కర్ణుడిని, భీముడు అశ్వత్థామను, సాత్యకి విందానువిందులను, చిత్రసేనుడు శ్రుతవర్మను, ప్రతివింద్యుడు చిత్రసేనుని, ధర్మరాజు దుర్యోధనుని, అర్జునుడు సంశప్తకులను, ధృష్టద్యుమ్నుడు కృపాచార్యుని, శిఖండి కృతవర్మను, శ్రుత కీర్తి శల్యుని, సహదేవుడు దుశ్శాసనుని, ఎదుర్కొన్నారు. ధర్మరాజుతో యుద్ధంచేసి, దుర్యోధనుడు విరథుడై మూర్ఛిల్లాడు. సాత్యకి విందానువిందులను సంహరించాడు. అశ్వత్థామ భీముని నొసటన ' ప్రదరము ' అనేబాణం దిగేటట్లు ప్రయోగించాడు. తిరిగి భీముడుకూడ వాని నుదుటన దిగబడేటట్లు మూడు తీవ్రబాణాలు ప్రయోగించాడు. దుశ్శాసన, సహదేవుల ద్వంద్వయుద్ధంలో సహదేవుడు ప్రయోగించిన బాణం కాంతిపుంజంవలె ఆకాశప్రదేశంలో కాంతులు వెదజల్లుతూ మహావేగంతో వచ్చి, దుశ్శాసనుని కవచాన్ని, రొమ్మును చీల్చి, నెత్తురు కొంచమైనా అంట కుండా వెళ్ళిపోయింది. దానితాకిడికి దుశ్శాసనుడు మూర్ఛపోయాడు. ఇది ఆబాణం యొక్క వేగతీవ్రతను సూచిస్తుంది.

కర్ణ,నకులుల మధ్య బాణప్రయోగాలతో పోరు ఘోరంగా సాగింది. తనకు ఓడిపోయి, పారిపోయే నకులుని వెంటాడి పట్టుకునిన కర్ణుడు తనతల్లి కుంతికిచ్చిన మాట ననుసరించి, వానిని ప్రాణాలతో విడిచిపెట్టాడు. అనాటియుద్ధంలో సత్యసేనుడు ప్రయోగించిన బలమైన ఈటె కృష్ణుని భుజాన్ని గాయపరచగా. అర్జునుడు తీవ్రమైనకోపంతో వానినెదుర్కొని, సంహరించాడు. ప్రతివింద్యుడు గొప్పదైన తన తోమరంతో చిత్రసేనుని సంహరించాడు. ఆనాడు కృపాచార్యుని పరాక్రమానికి వాని ఇనుపబాణాలధాటిని తట్టుకోలేక, ధృష్టద్యుమ్నుడు, శిఖండి, వాని సైన్యము కూడా యుద్ధరంగంనుండి పారిపోయారు. అర్జునుడు వెండితోచేసిన పుంఖంవున్న వెడల్పైన ఒకబాణంతో మిత్రసేనరాజును ఖండించాడు. అతడు సంశప్తకులపై ఐంద్రాస్త్రాన్ని ప్రయోగిస్తే, అది భల్లం, అంజలిక మొదలైన బాణాల రూపం ధరించి ప్రకాశించింది. ఇందు భల్లం అనగా బల్లెంవంటి అగ్రభాగం కల ఆయుధం, అంజలిక అనగా చిట్టెలుక మూతివంటి అగ్రభాగం కల బాణం. ఆనాటి యుద్ధంలో గెలుపు పాండవులదయ్యింది.

## కర్ణుని రెండవనాటి యుద్ధము :

ధర్మరాజు ఆనాడు బృహస్పతి మతానుసారం దుర్జయవ్యూహాన్ని పన్నాడు. కృష్ణునికి ప్రతిగా తనకు ఒక సమర్థుడైన సారథి కావాలని, శల్యుని సారథిగా ఒప్పించుమని, కర్ణుడు దుర్యోధనుని కోరాడు. దానికంగీకరించిన శల్యుడు తాను ధర్మరాజుకిచ్చిన మాట ప్రకారం పాండవులపరాక్రమాన్ని ప్రశంసిస్తూ, కర్ణునిలోని లోపాలను ఎత్తిచూపుతూ ఎత్తిపొడుపు మాటలతో వాని ఉత్సాహాన్ని ఎప్పటికప్పుడు నీరుకారుస్తూ సార్థక నామధేయు డయ్యాడు. ఆనాడు జరిగిన యుద్ధంలో భీముడు భయంకరమైన భల్లంతో కర్ణుడి వక్షస్థలంపై కొట్టగా, అతడు మూర్ఛపోయాడు. సంశప్తకులు అనేక శస్త్రాస్త్రాలతో అర్జునుని బాధపెట్టారు. సుశర్మ ప్రయోగించిన తీవ్రబాణానికి అర్జునుడు రథంలోనే మూర్ఛపోయాడు.శల్యుడి ప్రేరణతో కర్ణుడు పాండవసైన్యంపై భార్గవాస్త్రాన్ని ప్రయోగించి,వారిని చిందరవందర చేసి,సింహనాదం చేశాడు.

ఆనాటి యుద్ధంలో బీమ,దుశ్శాసనులకు జరిగిన ద్వంద్వ యుద్ధంలో భీముడు, దుశ్శాసనుని చంపి, గుండెలు చీల్చి తాను అనాడు కౌరవసభలో చేసిన ప్రతిజ్ఞ నెర వేర్చాడు. కర్ణార్జునులు ఒకరిపైఒకరు దివ్యాస్త్రాలను ప్రయోగించుకున్నారు. కర్ణుడు సర్ప ముఖాస్త్రాన్ని అర్జునుడిపై ప్రయోగించగా, కృష్ణుడు తమ రథాన్ని ఐదంగుళాలు భూమిలోనికి క్రుంగేటట్లు కాలి బొటనవ్రేలితో అదిమాడు. అది అర్జునుని కంఠానికి బదులు వాని కిరీటాన్ని తాకింది. ఖాండవదహనసమయంలో అర్జునునిపై కసిపట్టిన సర్పము వానిని చంపడానికి ఈ అస్త్రముగా మారింది. అది విఫలంకావడంతో తనను మరోసారి ప్రయోగించమని అది కర్ణుని కోరింది. కాని కర్ణుడు దానిని తిరస్కరించాడు.

అర్జుననితప్ప మిగిలిన పాండవులను చంపనని తనతల్లి కుంతికి మాట యిచ్చిన కారణంగా ఆనాడు యుద్ధరంగంలో మిగిలిన పాండవులు నలుగురు ప్రాణాలతో తన చేతికి చిక్కినా, కర్ణుడు వారిని చంపకుండా వదిలేశాడు. కర్ణుడు అర్జునునిపై భార్గవాస్త్రాన్ని ప్రయోగించాలనుకున్నా, శాపప్రభావంవల్ల అది స్ఫురించలేదు. చివరకు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. అర్జునుడు దానికి ప్రతిగా వానిపై ఐంద్రాస్త్రాన్ని ప్రయోగించి, ఫలితంలేక తిరిగి బ్రహ్మాస్త్రాన్నే ప్రయోగించి, దానిని ఉపశమింపచేశాడు. ఒక బ్రాహ్మణుని శాపప్రభావంతో కర్ణుని రథచక్రం భూమిలోకి దిగబడగా, అతడు వారించినా వినక, అర్జునుడు ఒక క్రూర, మహాస్త్రాన్ని ప్రయోగించి వానిని అధర్మంగానే వధించాడు. ఈవిధంగా కర్ణపర్వం కర్ణవధతో సమాప్తమయ్యింది.

# శల్యపర్వం

అశ్వత్థామసలహా మేరకు దుర్యోధనుడు శల్యుని సర్వసైన్యాధ్యక్షునిగా అభిషేకించాడు. అతడు వివిధ ఆయుధనైపుణ్యము కలిగిన యుద్ధవీరుడు. ఆనాడు అతడు సర్వతోభద్రవ్యూహాన్ని పన్నాడు.ముఖభాగమున కర్ణపుత్రులతో శల్యుడు, కుడివైపు యవనులు, ఎడమవైపు త్రిగర్తవీరులతో కృతవర్మ,వెనుక కాంభోజరాజుతో అశ్వత్థామ, నిలిచారు. శల్యుడిరథ కేతనం పసుపుపచ్చ వర్ణంకలది. పాండవులుత్రిముఖవ్యూహాన్ని రచించారు. మూడుముఖాలలో ధృష్టద్యుమ్నుడు, శిఖండి, సాత్యకులు నిలిచారు. యుద్ధంలో శల్యుడిపై ధర్మరాజు ముద్గరాన్ని, భీముడు భల్లాన్ని, నకులుడు శక్తిని, సహదేవుడు గదను ప్రయోగించగా, శల్యుడు బాణాలతో వాటిని వమ్ముచేశాడు. నకులుడు శక్తి ఆయుధంతో చిత్రసేనుని సోదరుడైన సత్యసేనుని, అర్ధ చంద్రాకృతిగలబాణంతో సుశర్మను సంహరించాడు. శల్య,భీమసేనుల గదాయుద్ధంలో శల్యుడు తోమరమనే ఆయుధంతో భీముని వక్షస్థలాన్ని బ్రద్దలు చేశాడు. ధర్మరాజు, తన రథానికి నకులుడు, సాత్యకి కుడివైపున, సహదేవుడు, ధృష్టద్యుమ్నుడు ఎడమవైపున రక్షకులుగా, ముందు అర్జునుడు, వెనుక భీముడు నడువగా, శల్యుని ఎదిరించి, వానిపై అనేక బాణాలు గుప్పించి, వాని గుఱ్ఱాలను, సారథిని చంపి, తన భక్తికిమెచ్చి, శివుడు తనకు ప్రసాదించిన గొప్పది, భయంకరమైన శక్తిని సంధించి, వానిపై ప్రయోగించాడు. అది వాని కవచాన్ని భేదించి, రొమ్ము చీల్చి,బయటకువచ్చి, భూమిలో ప్రవేశించింది. ఆవిధంగా శల్యుడు అంతమయ్యాడు.ఈవిధంగా శల్యవధతో శల్యపర్వం సమాప్తమయ్యింది. ఆనాడు ఒక్క భీముడే ఐదువందల రథాలను, ఏడువందల ఏనుగులను, ఎనిమిదివందల గుఱ్ఱాలను, పదివేల కాల్బలాన్ని సంహరించాడు. శకుని కుమారుడు ఉలూకుడు ఒక తీవ్రమైన బాణంతో సహదేవుని బాధించగా, అతడు ఒక బల్లెంతో వాని శిరసు ఖండించాడు. తన కుమారుని మరణంచూసి శకుని గొప్పకాంతివంతమైన శక్తి ఆయుధాన్ని ప్రయోగించగా, సహదేవుడు దానిని నుగ్గుచేసి, యుద్ధరంగంనుండి పారిపోయే అతడిని వెంటాడి, రెండుచేతుల రెండుబల్లెములతో వాని శిరసు ఖండించాడు. యుద్ధభూమిలో సంచరించు సంజయుని చేసి, సాత్యకి వానిని చంపబోగా, వ్యాసుడు ప్రత్యక్షమై వానిని వారించాడు. ఆనాటి యుద్ధంలో శల్యుడు, శకుని, వాని కుమారుడు ఉలూకుడు, సమస్త సంశప్తకులు, కాంభోజరాజులు, శకులు, యవనులు, పార్వతీయులు, మ్లేచ్ఛులు, కర్ణుని మనుమలు అందరూ మరణించారు.

# సౌప్తికపర్వం

యుద్ధమునకు చివర దుర్యోధనుడు ఏకాకిగానిలిచిన సమయమునకు
మిగిలిన వాని సేనాబలం రెండువేల రథములు, ఏడువందల ఏనుగులు, ఐదువందల గుఱ్ఱ
ములు, పదివేల కాల్బలము మాత్రమే! కౌరవవీరులందరూ మరణించడంతో దుర్యోధనుడు
ద్వైపాయన హ్రదమనే మడుగులో తన జలస్థంభన విద్యప్రయోగించి దాగున్నాడు. పాండవుల
చారులలో ఒకబోయవానివలన ఇది తెలిసిన పాండవులు వానిని సమీపించారు. భీముడు
వానిని తనమాటలతో రెచ్చగొట్టిబయటకు రప్పించి, వానితో ద్వంద్వయుద్ధానికి సిద్ధపడ్డాడు.
వారిరువురికి గురువైన బలరాముని గురూపదేశం సమానమే! అర్జునుని అభిప్రాయాన్న
నుసరించి, ఇరువురిలో భీముడిది బలం కల శరీరం. కాని పట్టుదల,పరిశ్రమలకారణంగా
దుర్యోధనుడు భీముడికంటె అధికుడు. వారిరువురి మధ్య యుద్ధం జరిగేసమయంలో శారీరక
బలమున్నదికనుక, భీముడు మూర్ఖపు పట్టుదలతో యుద్ధంచేస్తున్నా, నేర్పు, ఉపాయము గల
దుర్యోధనుని దెబ్బలకు నొచ్చుకుంటున్నాడు. కనుక వానితో ధర్మయుద్ధంచేసి భీముడు గెలు
పొందడం అసాధ్యం. మోసంతో తమను ఇన్నివిధాలుగా బాధపెట్టిన వానిని మోసంతో
చంపడమే తగినది. ధర్మాన్ని అతిక్రమించి అయినా దుర్యోధనుణ్ణి చంపాలి,

## భీమ,దుర్యోధనుల గదాయుద్ధము :

యుద్ధరంగంలో దుర్యోధనుని తొడలు విరుగగొడతానన్నది భీముని శపథం.
గదాఘాతంతో బొడ్డుక్రిందిభాగంలో నొప్పించడం అధర్మం. కనుక వేరొకమార్గంలో వాని తొడలు
విరుగగొట్టాలి. కనుక యుద్ధసమయంలో భీముడు తనవైపు చూసినపుడు అర్జునుడు తన తొడ
లను చేతితో చరిచాడు. ఆసైగను గ్రహించిన భీముడు సరియైన అదనుకోసం ఎదురుచూశాడు.
దుర్యోధనుని గదాఘాతానికి భీముడు క్రిందపడ్డాడు. అదేసమయంలో దుర్యోధనుడు వానిపై
పడడానికి ఎగిరి దూకినపుడు, ఆసమయంలో తేరుకొనిన భీముడు ఆత్మరక్షణార్థం తనగదను
వానిపైకి విసిరాడు. అది వజ్రపాతంవలె వానితొడలకు తగిలి అతడు నేలకూలాడు. తొడలు
విరిగి నేలపై కదలలేక పడివున్న దుర్యోధనునిచూచి, ' ఏకవస్త్రయైన ద్రౌపదిని అవమానించిన
పాపం అనుభవించు ' అంటూ భీముడు వాని తలను తన ఎడమపాదంతో తన్నాడు.

దానిని అధర్మయుద్ధంగాభావించి బలరాముడు భీముని చంపుటకు సిద్ధపడగా, కృష్ణుడువానికి అడ్డుపడి, 'రాజులకు చేసినప్రతిజ్ఞ నెరవేర్చడమే ఉత్తమమని, దుర్యోధనుని తొడలు విరుగగొడతానని భీముడు ప్రతిజ్ఞ చేశాడని, అంతేకాక దుర్యోధనునకు మైత్రేయ మహర్షి శాపంకూడా వున్నదని, కనుక ఈయుద్ధంలో భీముని దోషం ఏదీలేదని వానిని సమాధాన పరిచాడు. నిలిచి ఎదుర్కొన్నప్పుడు, నడిచేటప్పుడు, కాకుండా పైకెగిరినపుడు ఆత్మరక్షణార్థం చేసిన గదాఘాతంలో అది వాని బొడ్డుక్రింద తగలడంలో వాని దోషంలేదని తెలిపాడు. అట్లే వాని తలను తనపాదంతో తన్నడంకూడా ప్రతిజ్ఞలో భాగమేనని కృష్ణుడు వానిని సమర్థించాడు.

యుద్ధరంగంలో తొడలు విరుగగొట్టబడి, అవమానభారంతో దీనావస్థలో నున్న రారాజునుచూచి అశ్వత్థామ కోపంతో పాండవులను సంహరిస్తానని శపథంచేశాడు. దుర్యోధనుడు వానిని జలముతో అభిషేకించి పంపాడు. అశ్వత్థామ స్థిరసంకల్పాన్ని పరీక్షించదలచి, శివుడు వానిమార్గాన్ని నిరోధించి, వానిని పరీక్షించి, వానికి ఒక భయంకరమైన ఖడ్గాన్ని ప్రసాదించాడు. అతడు పాండవశిబిరంలో ప్రవేశించి, నిద్రిస్తున్న ధృష్టద్యుమ్నుడిని, కాలితో తన్నిలేపి, అల్లెత్రాటితో ఉరిపోసి చంపాడు. నిద్రిస్తున్న పాంచాలురను, ద్రౌపదేయులను తనఖడ్గంతో సంహరించాడు. అతడి రాక్షసావేశానికి, నీచపరాక్రమానికి కృపాచార్య, కృతవర్మలే తలలు వంచుకున్నారు.

జరిగిన దారుణం తెలిసి కృష్ణుడు, ధర్మరాజు, భీముడు, అర్జునుడు నలుగురూ అశ్వత్థామను వెదకడానికి బయలుదేరారు. పలాయితుడైన అశ్వత్థామ వ్యాసమహర్షి ఆశ్రమసమీపంలో తపస్సు చేస్తుండగా కనుగొన్నారు. వారిని చూచిన అశ్వత్థామ క్రోధంతో బ్రహ్మశిరోనామాస్త్రాన్ని గడ్డిపరకపై అభిమంత్రించి ప్రయోగించాడు. కృష్ణప్రేరితుడై అర్జునుడుకూడా అదే అస్త్రాన్ని ప్రయోగించాడు. లోక సంక్షోభాన్ని నివారించడానికి నారదుడువచ్చి,, ఎవరిఅస్త్రాలను వారు ఉపసంహరించమన్నాడు. అర్జునుడు తన అస్త్రాన్ని ఉపసంహరించాడు.

ఒకరు ప్రయోగించిన అస్త్రాన్ని అన్యుడు ఉపశమింపచేస్తే, పన్నెండేళ్ళు దేశానికి అనావృష్టి కలుగు తుందని, కనుక నీవే ఉపశమింపచేయమని నారదుడు అశ్వత్థామతో పలికాడు. దాని ఉపసంహారం తనతండ్రి ద్రోణుడు తనకు నేర్పకపోవడంవల్ల, అశ్వత్థామకు అది సాధ్యం కాలేదు. అది ఉత్తరగర్భాన్ని నాశనంచేయగా, మృతశిశువును కృష్ణుడు బ్రతికించాడు.

గురుపుత్రుడవ్వడంచేత అర్జునుడు అశ్వత్థామను చంపక వాని శిరోరత్నాన్ని మాత్రం గ్రహించి అవమానించి, ఆయుధాలతోబాటు, సిగ్గునుకూడా విడిచిపెట్టేటట్లు చేశాడు.

కురుక్షేత్రయుద్ధంలో 18 అక్షౌహిణీల సైన్యం నాశనమయ్యింది. ఈ పరిణామాన్ని ముందు ఊహించాడు కనుకనే ధర్మరాజు యుద్ధాన్ని వ్యతిరేకించాడు. యుద్ధానంతరం కురుసైన్యంలో మిగిలింది అశ్వత్థామ, కృపాచార్యుడు, కృతవర్మ. వీరు ముగ్గురు మాత్రమే! వీరిలో కృపాచార్యుడు హస్తినకు, కృతవర్మ ద్వారకకు, అశ్వత్థామ వ్యాసుని ఆశ్రమానికి చేరుకున్నారు. పాండవపక్షాన మిగిలినవారు ఐదుగురు పాండవులు,సాత్యకి, కృష్ణుడు, యుయుత్సుడు.

........

## ముగింపు

విద్యప్రయోజనం ప్రజాసంక్షేమమేకాని, ప్రజాసంక్షయంకాదు. అస్త్రప్రయోగంలోని మంత్రతంత్రాలను శాస్త్రీయదృక్పథంగల నేటి హేతువాదులు అంగీకరించకపోవచ్చు. ఆనాడు పాశుపతాస్త్రం చేసినపనిని, నేడు శాస్త్రజ్ఞులు, శాస్త్రీయదృక్పథంతో, క్షిపణుల ప్రయోగంతో కొన్నివేల కిలోమీటర్ల లక్ష్యాన్ని ఛేధిస్తున్నారు. నాటికాలపు అభూతకల్పన నేటి కాలపు వాస్తవం. 'ప్రశ్న' విజ్ఞానాభివృద్ధికి తొలిబీజం. ఎంతవిద్యనేర్చినప్పటికి, దాని సాధన, కార్యాకారణసంబంధంపై అవగాహన, ఏకాగ్రత, పరిశీలనాత్మకశక్తి, ఇవి ప్రతి సాధకునికి అవసరం. ఎంతవిద్యనేర్చినా, దానికి సాధన, దాని ప్రయోగానికి నైపుణ్యం అవసరం. అప్పుడే ఆవిద్య రాణిస్తుంది.

కాని దురదృష్టవశాత్తు, నేటివిద్యార్ధి చదువుకోవడంలేదు, చదువు 'కొంటున్నాడు.' గురువుకు శిష్యునికిమధ్య ఎప్పుడైతే ధనంతో సంబంధం ఏర్పడిందో, వారి మధ్య విద్యపట్ల అంకితభావం, గౌరవంపోయి, నిర్లిప్తత చోటుచేసుకుంటోంది. ధనాన్ని ఖర్చు చేసి విద్యపొందుతున్నాడు కనుక, తనవిద్యనుకూడా ధనసంపాదనకే వినియోగిస్తున్నాడు. స్వార్ధం, ప్రతీకారం, ఆలోచనారాహిత్యం, కుటిలత్వం, ధనంపైవ్యామోహం, అసహనంమొదలైన లక్ష్యాలతో నేర్చిన విద్యను ప్రయోగించడం ప్రజాపకారానికి దారితీస్తుంది. కురుక్షేత్రయుద్ధంలో జరిగిందదే! నేటివిద్యావిధానంలో జరుగుతున్నదదే! ఇది అవాంఛనీయం. ద్రోణ,కృపాచార్యాది గురువులుకాని, దుర్యోధనాది కౌరవులుకాని తామునేర్చిన విద్యను ఈవిధంగా తమతమ ధర్మాల పేరుతో తమ స్వార్ధానికో, ప్రతీకారం కోసమో వినియోగించడంవల్లనే ఇంతటి ప్రజాసంక్షయానికి కారణమయ్యింది.

కురుక్షేత్రయుద్ధంలో తనదైన ధర్మానికి కట్టుబడిన ఒక్క భీష్ముడుతప్ప, ధర్మాల ముసుగులో కురురాజుల ఉప్పుతిన్న ధర్మంపేరుతో, తన బ్రాహ్మణత్వానికి విరుద్ధంగా అహంకారంతో ప్రవర్తించిన ద్రోణుడుకాని, స్నేహధర్మంపేరుతో కురురాజుకు దాస్యంచేసి, కుటిలత్వాన్ని ప్రదర్శించిన కర్ణుడుకాని, ధర్మంపేరుతో బంధుత్వాన్ని విస్మరించిన శల్యుడుకాని,

అకారణ ద్వేషం, పగ, ప్రతీకారాలతో పాండవవంశాన్ని నాశనంచేయాలనుకున్న అశ్వత్థామకాని, తాము నేర్చినవిద్యను దుర్వినియోగంచేసి, ప్రజాక్షయానికి కారకులైనవారే! క్షత్రియధర్మానికి కట్టుబడి, పాండవులు యుద్ధంచేస్తే, ధర్మంపేరుతో స్వధర్మానికి కట్టుబడి యుద్ధంచేసి, ద్రోణ, కర్ణ,శల్యులు యుద్ధరంగంలో మరణించారు. భీష్ముడు మాత్రం తనవిధిని తాను నిర్వర్తించి, యుద్ధరంగం నుండి వైదొలిగాడు.

కార్యసాధనకు విద్య ఒక్కటే కారణంకాకపోవచ్చు. దానికి అదృష్టంకూడా కొంత కలిసిరావాలి. కర్ణునికి దుర్యోధనునిరూపంలో అదృష్టం కలిసొచ్చింది. కనుక అంగ రాజ్యాభిషక్తుడయ్యాడు.కాని అన్నివిద్యలూ తెలిసిన కర్ణుడు శాపగ్రస్తుడు. విద్యసాధనకోసం గురువునే మోసగించినవాడు అవిద్య వినియోగానికి ఇంకెన్నిమోసాలైనాచేయవచ్చు. కనుకనే పరశురాముడు వానిని శపించాడు. ఆవిధంగా కర్ణుడు శాపగ్రస్తుడయ్యాడు. దురదృష్టవంతు డయ్యాడు. అదృష్టమే దైవబలం.

తానొకపాలు, తనతోసమానులైన పదివేలమంది యాదవవీరులు మరొకపాలుగా చేసిన కృష్ణుడు, అంతేకాక, తానుఆయుధము ముట్టనని, సలహాలనిచ్చెదనని చెప్పినపుడు కూడ, సైన్యబలముకంటె, దైవబలమే గొప్పదని భావించిన అర్జునుడు కృష్ణునికోరి, ముందుగా కోరుకునే తన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. అట్లే ధర్మరాజు కూడ యుద్ధానికి ముందే భీష్మ,ద్రోణ, శల్యాది పెద్దలకు నమస్కరించి, తమకు జయంకలిగేటట్లు వారినుండి ఆశీర్వాదం పొందాడు. వారిబలాన్ని తనకు అనుకూలంగా మలచుకున్నాడు.11 అక్షౌహిణీల సైన్యంతో కౌరవులుసాధించలేని విజయం, కృష్ణునిరూపంలో దైవబలంతో, పెద్దల ఆశీర్వచన బలంతో ధర్మరాజు ఏడుఅక్షౌహిణీల సైన్యంతోనే సాధించాడు. కనుక ధనం, బలం,విద్య వున్న ప్పటికి, దైవబలమని చెప్పబడే అదృష్టంతోబాటు పరిస్థితులను తన కనుకూలంగా మలచుకోగల తెలివి, కార్యసాధక నైపుణ్యమే వ్యక్తి విజయానికి మూలకారణాలవుతాయి,

నేటికాలపువిద్యకూడా వ్యక్తి స్వార్థానికో, ధనానికో, కీర్తికోసమో వినియోగింప బడుతోంది. విద్యా విధానపుతీరు,విద్యాధ్యయనవిధానము, విద్యయొక్క లక్ష్యము ఆవిధంగా వుండడం విశేషం. విద్య వినియోగం గతులు తప్పితే, విద్యప్రయోజనం నాశనమౌతుంది. లోకానికి ఇది వినాశహేతువు. రోగగ్రస్తమైన రోగి శరీరాంగాలను బాగుచేయవలసిన విద్య, ఆరోగ్య వంతుడైన మానవుని శరీరాంగాలను అమ్ముకునేందుకు ఉపయోగపడుతోంది. తాను ప్రతి

పాదించిన సాపేక్షతాసిద్ధాంతం, ఎంతవిధ్వంసాన్ని సృష్టించిందో, దానిని ప్రతిపాదించేనాటికి ఐన్‌స్టీన్‌కే తెలియదు. ప్రజాప్రయోజనాలకోసం వినియోగించవలసిన అణుశక్తి,అణ్వాస్త్రాలుగా మారి, ప్రయోగింపబడితే అది ఎంతవిధ్వంసానికి కారణమౌతుందో ఇటీవల భారత,పాక్ సంబంధాల సందర్భంగా యుద్ధానికి సంబంధించిన పెను ప్రమాదాన్నిగూర్చి మనశాస్త్రజ్ఞులే వివరించారు. కనుక వ్యక్తి తానునేర్చినవిద్యను సక్రమమార్గంలో ప్రజాసంక్షేమానికి మాత్రమే వినియోగించడం ఎంతైనా అవసరం.

............

## సంప్రతింపు గ్రంథాలు


1. ఆంధ్రసాహిత్యచరిత్ర. ..... ఆచార్య పింగళి లక్ష్మీకాంతము
2. ఆంధ్ర మహాభారతం....... ఉద్యోగపర్వం.... తృతీయాశ్వాసము....
3. అచ్చతెలుగు కోశము .. ద్వితీయ సంపుటము...పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి.
4. విష్ణుధర్మోత్తర మహాపురాణం.. ద్వితీయఖండము శ్రీ కల్లూరి వేంకట సుబ్రహ్మణ్యదీక్షితులు. శ్రీ వేంకటేశ్వర ఆర్షభారతి ట్రస్ట్.. హైదరాబాద్.
5. పూర్వగాథాలహరి... వేమూరి శ్రీనివాసరావు.... వేంకట్రామ పబ్లికేషన్స్.
6. ఆంధ్రవిజ్ఞానము... ప్రసాదభూపాలుడు ..... యస్.ఆర్.పి. వర్క్స్, కాకినాడ.
7. అరణ్యపర్వ పీఠిక.... తి.తి.దే. ప్రచురణ.... తిరుపతి.
8. వాల్మీకి రామాయణం ..... బాలకాండ.. వాల్మీకి......పరిమళ పబ్లికేషన్స్.
9. భీష్మపర్వం.... తి.తి.దే. ప్రచురణ.... తిరుపతి.
10. ద్రోణపర్వం.... తి.తి.దే. ప్రచురణ.... తిరుపతి.
11. కర్ణపర్వం.... తి.తి.దే. ప్రచురణ.... తిరుపతి.
12. శల్యపర్వం..... తి.తి.దే. ప్రచురణ.... తిరుపతి.
13. సౌప్తికపర్వం.... తి.తి.దే. ప్రచురణ.... తిరుపతి.


..........